ప్రజాశక్తి
ఆదివారం 4 ఫిబ్రవరి 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





ఈ నెలలోనే 'వెలిగొండ' ప్రారంభం

- ముఖ్యమంత్రి జగనే ప్రారంభిస్తారు
- మంత్రి సురేష్


మాట్లాడుతున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-శింగరాయకొండ

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం ఈ ఫిబ్రవరి నెలలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతులమీదుగా జరుగుతుందని రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం నాడు శింగరాయకొండకొచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి చెప్పిన విధంగా ఫిబ్రవరి నెల అనగా ఈ నెలలోనే ప్రారంభోత్సవం చేస్తున్నామని చెప్పారు. గతంలో చంద్రబాబు ప్రాజెక్టులను అన్యాయం చేశారని, జగన్ మాట ఇచ్చి తప్పకుండా ప్రాజెక్టును పూర్తి చేశారని, ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తాను సొంత నిధులతోనే పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశానని, ఎవరి దగ్గరా వసూలు చేసి పెట్టే ఖర్మ తనకు లేదన్నారు. యర్రగొండపాలెంను అన్ని విధాలుగా అభివద్ధి చేశానన్నారు. ఆసుపత్రి, డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్లను అభివద్ధి చేశామన్నారు. మార్కాపురం జిల్లా విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలసీ ప్రకారమే జిల్లాలను విభజించామన్నారు. అక్కడ సబ్ కలెక్టర్ హెూదా ఏర్పాటు చేశామన్నారు. వైసీపీ ఒక దళితుల్నే నియోజకవర్గాల్లో మార్చలేదని, అన్ని కులాల వారినీ మార్చిందని చెప్పారు. ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసిన స్వామి సంగమేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఏం చెప్తారో సమాధానం ఇవ్వాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సంగమేశ్వరాన్ని ఎందుకు వదిలేశారో చెప్పాలన్నారు.

వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో నలుగురు మృతి

▶ 3లో

పట్టుదలతో శ్రమిస్తే మంచి ఫలితాలు

బాలినేని తప్ప..!

- వైసిపిలో సిట్టింగులందరూ తారుమారు
- కొత్త నియోజకవర్గాల్లో గెలుపు కోసం తీవ్ర కుస్తీలు
- స్థానిక నేతలను కలుపుకొనిపోయే విషయంలోనే సవాళ్లు
- రాజకీయ బదిలీల ఫలితం ఎలా ఉంటుందన్న దానిపైనే చర్చ



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఆరు జాబితాలతో వైసిపిలో అన్ని నియోజకవర్గాలకు సమన్వయకర్తల పేరుతో నియమించిన నేతలే రేపు ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేస్తారు. ఇందులో ఎలాంటి సందేహాలు లేవు. అయితే బటన్ నొక్కుడు కార్యక్రమాన్ని చారిత్రాత్మకంగా చెప్పకుం టున్న వైసిపి అధిష్టానం ఒక్కసారిగా సిట్టిం గులను తారుమారు చేసింది. మంత్రులను సైతం వారి సొంత స్థానాల్లో పోటీకి అను కూలంగా లేదని సమూల మార్పులు చేశారు. కేవలం వారిపై వ్యతిరేకతా? లేక ప్రభుత్వంపై వ్యతిరేకతా? కారణాలేమైనా జిల్లాలో మాజీ మంత్రి బాలినేని తప్ప సిట్టింగు స్థానాలన్నిం టిలోనూ మార్పులు జరిగిపోయాయి.

గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ముగ్గురికి టిక్కెట్లే గల్లంతవ్వగా మిగతావారికి అవకాశం ఇచ్చినా నియోజకవర్గాలే మారిపోయాయి. మంత్రి ఆదిమూలపు సురేష్ కొండపి, గుంటూరు జిల్లాలో ఉన్న మంత్రి మేరుగ నాగార్జునను సంతనూతలపాడుకు పెట్టారు. ఆరో జాబితాలో గిద్దలూరు, మార్కాపురం సిట్టింగు ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, నాగార్జునరెడ్డికి అవకాశం వచ్చినా వారిని కూడా అటూఇటూ మార్చేశారు. దర్శిలో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి, కనిగిరిలో జడ్పీటీసీగా ఉన్న దద్దాల నారాయణ, వైపాలెంలో చంద్రశేఖర్‌కు అవకాశం కల్పించారు. ఇద్దరు కొత్తగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతుండగా మిగతా ఆరుగురు ఇప్పటికే ఎమ్మెల్యేగా పలుమార్లు గెలిచారు. అయితే ఒంగోలులో తప్ప ఎక్కడా సిట్టింగులకు తిరిగి అక్కడే అవకాశం ఇవ్వలేదు. మంత్రి సురేష్ ఆఖరు నిమిషం వరకూ వైపాలెంలోనే ఉండాలని ప్రయత్నాలు చేసినా సిఎం జగన్ అంగీకరించలేదు. మరో మంత్రి పరిస్థితి కూడా ఇదే.. అందుకు బలమైన కారణాలనే చూపుతున్నారు. తెలంగాణాలో సిట్టింగులను తిరిగి టిక్కెట్లు ఇవ్వడంతో వ్యతిరేకత వల్ల ఓడిపోయారనేది విశ్లేషణ. దాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకోలేదు. వాస్తవంగానూ నియోజకవర్గాల్లో చేపట్టిన సర్వేల్లో అందరిపైనా ఊహించనంత వ్యతిరేకత వచ్చిందని సమాచారం. వీటిని ఆధారంగా చేసుకునే మార్పులు చేశారు. రాజకీయ బదిలీలుగా చెప్పుకుంటున్న వీటిని ఫలితం ఎన్నికల్లో ఎలా ఉంటుందనే దానిపైనే మిశ్రమ స్పందన వస్తోంది. గెలుపు, ఓటములకు అంచనాలు వేస్తున్నారు. వెళ్లిన చోట గతంలో ఉన్న ఓట్లకు అదనంగా ఐదు వేలు తెచ్చుకున్నా గెలుపు సునాయాసమని అధిష్టానం వ్యక్తిగతంగా సమన్వయకర్తలకు చెప్పి మార్పులు చేశారు. సామాజికపరంగానూ దృష్టి సారించి వ్యూహాత్మకంగా మార్పులకు శ్రీకారం చుట్టారు. ఒంగోలులోనూ అదేపరిస్థితి ఉందన్న కారణంతో బాలినేని కూడా గిద్దలూరుకు పంపాలని భావించారు. ఆయన పట్టుబట్టి ఇక్కడే పోటీకి సిద్ధమవుతున్నారు. అయితే ఈ మార్పులకు అనేక సవాళ్లు తప్పడం లేదు. సిట్టింగు స్థానాల్లో స్వయంకృతాపరాధాలే బదిలీలకు కారణాలుగా ఉన్నాయి. భూకుంభకోణాలు, ఇసుక దందాలు, గనుల నుంచి వసూళ్లు, గ్రావెల్, రేషన్‌బియ్యం, భూముల కబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, భారీగా సంపాదనలు వంటివి సిట్టింగులపై వ్యతిరేకతకు కారణాలుగా ఉన్నాయి. అనేక మంది వీటిల్లో నేరుగా భాగస్వాములుగా ఉన్నారు. పార్టీ అంతర్గత సమావేశాల్లోనూ వీటిపై చర్చ వచ్చింది. పార్టీ కోఆర్డినేటర్ ముందే సంతనూతలపాడు నియోజకవర్గ నేతలు కొట్లాటకు దిగిన సంగతి ▶ 2లో

పర్చూరులో వైసిపి..చీరాలలో టిడిపి..

టిక్కెట్ల ఖరారుపై సందిగ్ధం

- చీరాల జనసేనకు కేటాయిస్తారంటూ ప్రచారం
- పర్చూరు నుంచి 'ఆమంచి పోటీ'పై వైసిపి కేడర్‌లో అయోమయం



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో వైసిపి, టిడిపిల తరఫున రానున్న ఎన్నికల్లో ఎవరు పోటీ చేయనున్నారనే విషయమై దాదాపు స్పష్టత వచ్చింది. ప్రధాన రాజకీయ పార్టీల అధిష్టానాలు తమ అభ్యర్థుల ఎంపికలను గతంలో కంటే కొంచెం ముందుగానే ఖరారు చేశారు. పర్చూరు నుంచి వైసిపి తరఫున ఎవరు పోటీలో ఉంటారు. చీరాల స్థానం నుంచి టిడిపి నుంచి అభ్యర్థి పోటీలో ఉంటారా లేక జనసేనకు చీరాల కేటాయిస్తారా.? అన్న విషయమై సందిగ్ధం నెలకొంది.

టిడిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న ఎంఎం కొండయ్య ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ మేరకు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ పిలుపునిచ్చిన అన్ని కార్యక్రమాలనూ నిర్వహిస్తూ వచ్చారు. చీరాలలో గతంలో టిడిపి తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన చిమటా సాంబు, డాక్టర్ పాలేటి రామారావు, కరణం బలరామకృష్ణమూర్తి అనంతర కాలంలో పార్టీని వీడారు. నవోదయం పార్టీ తరఫున గెలిచి తరువాత టిడిపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కూడా ఆ తరువాత వైసిపిలో చేరారు. దీంతో చీరాలలో ఉన్న టిడిపికి చెందిన నేతలందరూ ఆ తరువాతి కాలంలో వైసిపిలోనే ఉండిపోయారు. చీరాలలో టిడిపికి గణనీయమైన సంఖ్యలో ఓటర్లు ఉన్నప్పటికీ బలమైన నేత లేకుండా పోయారు. ఈ దశలో ఎంఎం కొండయ్య చీరాల టిడిపి ఇన్‌ఛార్జిగా వచ్చారు. టిడిపి వారందరినీ ఒకచోట చేర్చి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేశారు. చీరాల బైపాస్ రోడ్డులో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశారు. కొండయ్యతో పాటు ఆయన కుమారుడు అమర్‌నాథ్ కూడా స్థానికంగానే ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బాపట్ల జిల్లాలో జనసేన తరఫున ఒక స్థానాన్ని కోరుతున్నారు. అది చీరాలగా చెబుతున్నారు. చీరాలకు చెందిన ఆమంచి స్వాములు జనసేనలో చేరి టిక్కెట్‌ను ఆశించి గిద్దలూరు నుంచి పోటీకి సిద్ధమయ్యారు. కానీ ప్రకాశం జిల్లాలో దరిశి స్థానాన్ని జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం ఉన్నందున గిద్దలూరు జనసేనకు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో చీరాలలోనే పోటీ చేసేందుకు ఆమంచి స్వాములు సిద్ధమవుతున్నారు. టిడిపి-జనసేన పొత్తులో భాగంగా చీరాలను జనసేనకు కేటాయిస్తే ఆమంచి స్వాములు పోటీలో ఉంటారని తెలుస్తోంది. చీరాలలో చేనేతలు అధిక సంఖ్యలో ఉన్న నేపథ్యంలో ఇక్కడ నుంచి చేనేతలు అందునా పద్మశాలీలు టిడిపి టిక్కెట్ కోరుతున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన పద్మశాలీల సమావేశంలో ఈ మేరకు డిమాండ్ చేశారు. చీరాల నుంచి ఎవరు ఎన్నికల బరిలో ఉంటారనే విషయమై టిడిపి అధిష్టానం స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

పర్చూరు నుంచి వైసిపి తరఫున కాపు సామాజిక వర్గానికి చెందిన వారిని ఎన్నికల బరిలో నిలపాలన్న పార్టీ అధినేత జగన్ నిర్ణయం మేరకు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను పర్చూరు పంపారు. కానీ ఆమంచి మాత్రం చీరాల ▶ 2లో

ఇళ్ల పట్టాల పంపిణీకి

యుద్ధ ప్రాతిపదికన చర్యలు

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్


ఇళ్లస్థలాల కోసం భూముల మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

హౌసింగ్ అర్బన్ లే అవుట్‌లో ఒంగోలు నియోజకవర్గంలో 25 వేల మందికి ఇళ్ల పట్టాల పంపిణీకి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏఎస్. దినేష్‌కుమార్ తెలిపారు. ఈ దిశగా ఇప్పటికే రైతుల నుండి మల్లేశ్వరపురం, ఎన్.అగ్రహారం, మరియు వెంగముక్కలపాలెం తదితర గ్రామాలలో భూమి సేకరించి రైతులకు నష్టపరిహారాన్ని కూడా అందజేశామన్నారు. శనివారం ఆయన అగ్రహారం, వెంగముక్కలపాలెంలో పట్టాల పంపిణీ కోసం ఈ భూములలో చేస్తున్న ఏర్పాట్లను సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లపట్టాల కోసం 520 ఎకరాలను గుర్తించామని, వీటిలో ఇప్పటికే 435 ఎకరాలకు భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. ఇందుకోసం భూములు ఇచ్చిన రైతుల ఖాతాలలో సుమారు 166 కోట్ల రూపాయల నష్ట పరిహారాన్ని జమ చేశామన్నారు. మల్లేశ్వరపురం, ఎన్. అగ్రహారం, వెంగముక్కలపాలెం గ్రామాలలోని ఈ భూములలో జంగిల్ క్లియరెన్స్, సర్వే పనులను చేపట్టామన్నారు. ఈ లేఅవుట్లకు అప్రోచ్ రోడ్డు, డ్రైనేజీ సదుపాయలను ఏ విధంగా కల్పించాలనే విషయంపై ఓయుడిఏ, అర్బన్ ఇంజినీర్లతో ప్రణాళిక రూపొందించామన్నారు. పంపిణీ కోసం ఇళ్ల పట్టాల ప్రింటింగ్ ఇప్పటికే పూర్తయిందని, రెండు, మూడు రోజులలోనే వీరికి లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు చేస్తామన్నారు. అనంతరం వీరికి ప్లాట్ మ్యాపింగ్ చేసి.. ఆ వివరాలతో పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. వచ్చే రెండు వారాల పాటు రెవెన్యూ, ఓయుడిఏ, మున్సిపల్ అధికార యంత్రాంగంతో యుద్ధప్రాతిపదికన రాత్రింబవళ్లు ఈ స్థలాలలో జంగిల్ క్లియరెన్స్, స్టోన్స్ ప్లాంటేషన్, అంతర్గత రోడ్లు, ఇతర అవసరమైన పనులను ▶ 2లో

బాలినేని తప్పు!

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. పార్టీపరంగా అన్నిచోట్లా వర్గాలు, అసమ్మతులు, పెత్తనం వద్ద పేచీలు, కాంట్రాక్టులు, పదవులు వంటి వాటితో అన్ని నియోజకవర్గాల్లో సమస్యలు తెరపైకి వచ్చాయి. జిల్లా నేతల మధ్య సమన్వయం లేదు. వీరి మధ్య కూడా ఆధిపత్య పోరు బహిరంగంగానే నడిచింది. ఇవన్నీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలపై నెగిటివ్ ప్రభావం చూపాయి. జనంలో గెలుస్తాడనేది పోయి ఓడిపోవడం ఖాయమనే ప్రచారాలు ముందుకు వచ్చాయి. మంత్రి మొదలూ ఎమ్మెల్యేలందరిపైనా ఇదే వచ్చింది. అందుకే మార్పులు జరిగాయి. ఇక మారిన కొత్త స్థానాల్లోనూ సవాళ్లు తప్పడం లేదు. ఇప్పటికే వర్గాలుగా ఉన్న నేతల్లో ఎవరికి ప్రాధాన్యత ఇస్తే ఎవరు ఎలా స్పందిస్తారోనన్న ఇక్కట్లు తప్పడం లేదు. ఒకవర్గం నేతలతో మాట్లాడితే రెండోవర్గం అలక బూనడాలు వంటివి పలుచోట్ల చోటుచేసుకుంటున్నాయి. మండల నేతలను గుర్తించి వారిని పేరుపెట్టి పిలవడానికే చాలా సమయం పట్టేలా ఉంది. ఈ లోపు ఎన్నికలు రానే వస్తాయంటున్నారు. కొత్త నియోజకవర్గాల్లో వారి పరిస్థితి ఇలా ఉంది. బాలినేని ప్రస్తుతం అధిష్టానంపై గుర్రుగా ఉన్నందున ఆయన అనుచరులు చాలాచోట్ల సందిగ్ధంగా ఉన్నారు. వేచిచూస్తున్నారు. ఇంకా ఎంపీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తే గానీ పరిస్థితి అర్థం కాదు. ఏదేమైనా వైసిపి చేపట్టిన రాజకీయ బదిలీల ప్రయోగం ఎలా ఉంటుందో చూడాలి.

టిక్కెట్ల ఖరారుపై సందిగ్ధం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి పోటీ చేయాలన్న ఆలోచనలోనే ఉన్నారు. గత వారం చీరాలలో తన అనుయాయులతో జరిపిన అంతర్గత సమావేశంలో తాను చీరాల నుంచే పోటీ చేయనున్నట్లు చెప్పారు. అంతకుముందు తాడేపల్లికి వెళ్లి వైసిపి అధిష్టానం పెద్దలకు తన మనసులో మాట చెప్పినట్లు తెలిసింది. కానీ చీరాల అవకాశం లేదని పర్చూరు నుంచే పోటీ చేయాలని వారు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. చీరాల నుంచి పోటీ చేస్తానని తన అనుయాయులతో చెప్పిన తరువాత ఆమంచి యథావిధిగా పర్చూరు వెళ్లి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దీంతో పర్చూరులో ఉన్న వైసిపి క్యాడర్ కూడా ఆమంచి పర్చూరు నుంచి పోటీ చేస్తారా.? లేక తీరా ఎన్నికల నాటికి చీరాల వెళతారా.? అన్న అయోమయంలో ఉన్నారు. ఈ క్రమంలో వైసిపి అధిష్టానం పర్చూరు నుంచి ఆమంచి పోటీ చెయ్యకపోతే ఎవరిని ఎన్నికల బరిలో నిలపాలన్న ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం కాపు సామాజికవర్గానికి చెందిన కంది రవిశంకర్, మద్దిశెట్టి వేణుగోపాల్, కమ్మ సామాజికవర్గానికి చెందిన రావి రామనాథంబాబు, గొట్టిపాటి భరత్ పేర్లను పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. కొంతకాలం గడిస్తే గానీ చీరాల టిడిపి, పర్చూరు వైసిపి అభ్యర్థులు ఎవరనే విషయం వెల్లడవుతుందని భావిస్తున్నారు.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగిస్తామన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వెంగముక్కలపాలెంలోనే పాత్రికేయులకు..

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంతో వెంగముక్కలపాలెంలోని లేఅవుట్ పక్కనే వీరికి కూడా స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం అవసరమైన 7-8 ఎకరాల భూమిని గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, తహశీల్దార్ మురళి, ఇతర అధికారులు ఉన్నారు.

మోటర్లకు మీటర్లు పెడతామనడం దుర్మార్గం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెడతామనడం దుర్మార్గమైన ఆలోచన అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డివిజన్ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ మోటర్లకు మీటర్లు పెట్టేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే మీటర్లు వచ్చినట్లు చెప్పారు. ఎవరూ వీటిని పెట్టించుకునేందుకు ముందుకు రావద్దని కోరారు.



రాస్తారోకో చేస్తున్న ఎస్సీపాలెం వాసులు

నీటి కోసం రాస్తారోకో

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం ఎస్సీ పాలెంలో నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. భూగర్భ జలమట్టం పడిపోయి డీప్ బోర్లన్నీ మొరాయిస్తున్నాయి. బిల్లులు చెల్లించలేదంటూ ట్యాంకర్ల యజమానులు నీళ్ల తోలకం నిలిపివేశారు. దీంతో ఎస్సీ పాలెం వాసులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. గత్యంతరం లేక శనివారం పెద్దదోర్నాలలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా గల గుంటూరు-కర్నూలు జాతీయ రహ దారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్పటి దాకా కదిలేది లేదంటూ భీష్మించుకొని కూర్చున్నారు. అధికారులు సమస్యను పరిష్కరిస్తామని తెలపడంతో రాస్తారోకోను విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోకవర్గ కార్యదర్శి దేవెండ్ల శ్రీనివాస్, నాయకులు తిరుమలయ్య, ఆచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విభజన హామీలు మరిచిన బీజేపీ: సిపిఎం

ప్రజాశక్తి-దర్శి

ప్రత్యేక హోదా, విభజన హామీలు విస్మరించిన కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం కార్యకర్తల సమావేశం పార్టీ నాయకులు సందు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో మండల నాయకులు ఈమని నాగేశ్వరరావు, ఉప్పు నారాయణ, గోగు వెంకయ్య, రంగనాయకులు, ఇత్తడి జాన్, ఎస్ రంగమ్మ, టి పద్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యలో రాణిస్తేనే బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి-పొదిలి

విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యలో రాణిస్తేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యం అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో ఎస్ఎస్‌పిఎ వృత్తి విద్యా ట్రైనర్ కె లక్ష్మీప్రసన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి కరిమూన్ బీ, కళాశాల సిబ్బంది కార్తీక్, ఉపాధ్యాయులు బివి రెడ్డి, కోటయ్య, రంగనాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిద్దలూరు అర్బన్ సీఐగా వైవీ సోమయ్య

ప్రజాశక్తి-గిద్దలూరు

అర్బన్ సీఐగా వైవీ సోమయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో తిరుపతి జిల్లా నాయుడుపేటలో విధులు నిర్వహించగా సాధారణ ఎన్నికలలో భాగంగా గుంటూరు రేంజ్ వీఆర్ నుంచి కొత్తగా అప్డేట్ అయిన గిద్దలూరు పోలీస్ స్టేషన్‌కు అర్బన్ సీఐగా వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ వెలగ మహేష్‌ను ఒంగోలు దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన సీఐ వైవీ సోమయ్య మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అసాంఘిక కార్యక్రమా లు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని కోరారు.

సచివాలయాల్లో ఆర్‌డిఒ తనిఖీ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని గొట్లగట్టు, గరిమెనపెంట సచివాలయాలను కనిగిరి ఆర్‌డిఒ పాలపర్తి జాన్‌ఇర్విన్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీఓల్డ్ ఆఫ్ అసెస్మెంట్ భూములు గురించి, జగనన్న లేఅవుట్‌లోని ఎన్‌పిఐ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా విఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు సమన్వయతో పనిచేసి పూర్తి చేయాలని అన్నారు. అనంతరం కొనకనమిట్ల తహశీల్దారు కార్యాలయంలో ఆర్‌డిఒ సమావేశం ఏర్పాటు చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వీరితో పాటు తహశీల్దారు సాజిదా, విఆర్ఒలు ఉన్నారు.

కనీస వేతనం రూ.10 వేలివ్వాలి..

ప్రజాశక్తి-కురిచేడు

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని సీఐటీయు కురిచేడు మండల గౌరవ అధ్యక్షులు సందు వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక ఎంఈఒ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు ముంతాజ్ బేగం అధ్యక్షత వహించగా నాయకులు బేగం వెంకటరత్నమ్మ, పేరమ్మ, చెన్నయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-పులల్లచెరువు

మండలంలోని కొమరోలు, యండ్రపల్లి చెంచుగూడేలలో శనివారం చెంచు గిరిజనులకు గూంజ్ సేవా సంస్థ సహకారంతో గోల్డ్ ఇండియా వాలంటరీ ఆర్గనైజేషన్ నిత్యావసరాలు పంపిణీ చేసింది. ముఖ్య అతిథిగా డాక్టర్ మన్నె రవీంద్ర హాజరయ్యారు. క్లాత్ ఫర్ కిట్స్‌ను చెంచు గిరిజనులకు పంపిణీ చేశారు. డాక్టర్ రవీంద్ర మాట్లాడారు. అనంతరం 120 మంది చెంచు గిరిజనులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మన్నె రవీంద్రను ఘనంగా సన్మానించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

ఆరుగురికి గాయాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. జరుగుమల్లి, గిద్దలూరు, మార్టూరు మండలాల్లో శనివారం ఈ ప్రమాదాలు జరిగాయి.

ప్రజాశక్తి-శింగరాయకొండ

జరుగుమల్లి మండలం చిలుకూరుపాడు గ్రామంలో కట్టెల ట్రాక్టర్‌ను మోటార్ బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతిచెందగా ఒకరు తీవ్ర గాయాలపాలయ్యారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వీరు కే ఉప్పలపాడు గ్రామంలో నూడిల్స్ బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. జరుగుమల్లి వైపు నుంచి తిరిగి మోటార్ బైక్‌పై వెళుతుండగా కట్టెల ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మంజప్ప(36), కేవై విజేత(28) మృతి చెందగా వి రఘువీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని, మృతదేహాలను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. జరుగుమల్లి పోలీసులు ఇద్దరి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలం దిగువమెట్ట నల్లమల్ల అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. టాటా ఏస్ వాహనం అదుపుతప్పి వంతెనను ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా అదే వాహనంలో ప్రయాణిస్తున్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న గిద్దలూరు అర్బన్ సీఐ వీర సోమయ్య ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరిశీలించారు. ఈ రోడ్డు ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుల వివరాలు తెలియాల్సి వుంది.

మార్టూరు రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం మార్టూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన బిట్రగుంట మల్లేశ్వరరావు తన భార్య అపర్ణ ఇద్దరు చిన్నారులతో కలిసి నాగరాజుపల్లి గ్రామంలో జరిగే శుభకార్యానికి బైకుపై వెళ్తున్నారు. ఈ క్రమంలో స్థానిక వివేకానంద స్కూల్ ఎదురుగా వస్తున్న మరొక వాహనదారుడు వీరి బైకును నిర్లక్ష్యంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లేశ్వరరావును మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇద్దరు చిన్నారులు, భార్య అపర్ణ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మల్లేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


జరుగుమల్లి మండలంలో ప్రమాద మృతులు


గిద్దలూరు మండలంలో మృతిచెందినవారు

ఉపాధిపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మార్కాపురం మండల వ్యాప్తంగా ఉన్న 21 పంచాయతీల్లో 2022-23లో జరిగిన సుమారు రూ.11,37,17,760 విలువైన 915 రకాల పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు సేకరించిన సమాచారం మేరకు డ్వామా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శీనా రెడ్డి అధ్యక్షతన శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పనుల్లో జరిగిన అక్రమాలపై సంబంధిత ఉపాధి సిబ్బంది నుంచి సుమారు రూ.40,000 రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారి ఈ ఝాన్సీరాణి, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్, మార్కాపురం మండల ఎంపీపీ పోరెడ్డి అరుణ, ఎంపీడీవో తోట చందన, ఎస్ఆర్‌పి సుబ్బారావు, ఏపీవో బీ జీవరత్నం, పంచాయతీరాజ్ ఏఈ మోహన్ రాజా, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఆర్పీలు, సీఆర్పీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల మనసులో భక్తయ్యది చెరగని ముద్ర

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు



మండలంలోని ఉప్పుగుండూరు మాజీ సర్పంచ్ కామ్రేడ్ గోగినేని న్యాషాభక్తరాజు (భక్తయ్య) మరణించి 40 సంవత్సరాలైనప్పటికీ నేటికీ ప్రజల మనసుల్లో నిలిచిపోయారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా కథనం.. భక్తయ్య 1902 సంవత్సరంలో ఉప్పుగుండూరు గ్రామ రైతు కుటుంబంలో జన్మించారు. 30 సంవత్సరాలు గ్రామ సర్పంచ్‌గానూ, 30 సంవత్సరాలు కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగానూ ఊరచెరువు ట్రస్టీగా, శ్రీవేణుగోపాలస్వామి ఆళ్వారాజుల స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ పనిచేశారు. అప్పట్లో గ్రామాభివృద్ధికి ఎనలేని సేవలందించారు. కమ్యూనిస్టు కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి రైతు ఉద్యమాలకు సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటాలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి భక్తయ్య అప్పట్లో బుర్రకథ దళాలను ఏర్పాటు చేసి గ్రామగ్రామాన వీధినాటికలను ప్రదర్శించి ప్రజలను చైతన్య పరిచారు. అదేవిధంగా ఆయన స్థాపించిన ఉప్పుగుండూరు ప్రజానాట్యమండలి దళం రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు పొందింది యువతను అభ్యుదయ మార్గంలో నడిపించేందుకు యువజన బాల సంఘాలను స్థాపించి ఎక్కడ పేదప్రజలు పోరాటాలు చేస్తున్నా వారికి బాసటగా నిలిచి తనవంతు సహకారాన్ని అందించారు. తన జీవితాంతం నిక్కచ్చిగా ప్రజల పక్షాన నిలిచారు. అప్పట్లో దళితులను గ్రామాల్లోకి రానివ్వని సమయంలో వారి కోసం గ్రామంలో ప్రత్యేకంగా రెండు బావులు తవ్వించారు. ప్రస్తుతం అవి అందరి బావులయ్యాయి. తన ఇంటిలో ఉన్న బావి నుంచి కూడా నీరు తీసుకెళ్లే విధంగా ఎప్పుడూ తలుపులు తీసి ఉంచేవారు. వీధి నాటికలకు నేర్పించేందుకు తన ఇంటినే విడిదిగా ఏర్పాటు చేశారు. ఆ విధంగా 30 సంవత్సరాల పాటు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధితో పాటు ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేసి నేటికీ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. భక్తయ్య లాంటి నిస్వార్థపరుల సేవలు గుర్తు చేసుకుంటూ ఆయన స్ఫూర్తిని కొనసాగించేందుకు భక్తయ్య విజ్ఞాన కేంద్రం ఏర్పండింది. ఈ సంస్థ యువతలో సామాజిక స్పృహను కలిగించటం అభ్యుదయ భావాలను పెంపొందించడం విద్య, వైద్యం పట్ల అవగాహన కలిగించడం, గ్రామాభివృద్ధికి తోడ్పడడం లాంటి ఆశయాలతో పనిచేస్తోంది. అప్పటి నుంచి ఉచిత వైద్యశిబిరాలు, మహిళలకు కుట్టుశిక్షణ, బాలబాలికల్లో సృజనాత్మకతను పెంచేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదికగా ఉండటానికి భక్తయ్య విజ్ఞాన కేంద్రం బిల్డింగ్ నిర్మాణానికి కేంద్రం ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. అందుకు గ్రామస్తుల సహాయ సహకారాలను అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు 40వ వర్ధంతి సభ

ఆదివారం ఉప్పుగుండూరులో మాజీ సర్పంచ్ గోగినేని న్యాషాభక్త రాజు(భక్తయ్య) 40వ వర్ధంతి సభను భక్తయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వర్ధంతి సభలో గ్రామస్తులు, భక్తయ్య అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కళాశాల భవనం పైనుంచి దూకి..

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

కళాశాల భవనం పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని దరిమడుగు గ్రామంలో శనివారం జరిగింది. గ్రామంలోని ఓ నర్సింగ్ కళాశాల భవనం పైనుంచి దేవసుత్ జానకీ బాయి అనే నర్సింగ్ విద్యార్థిని దూకింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించిన స్థానికులు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. దరిమడుగులోని మదర్ కేర్ నర్సింగ్ కళాశాల యాజమాన్యం వేధింపులే కారణమని విద్యార్థిని తెలిపింది. కళాశాలలో చేరినప్పటి నుంచి భోజనంతో పాటు వసతులు అత్యంత దారుణంగా ఉన్నాయని బాధిత విద్యార్థిని ఆరోపించింది. ఎలుకలు పడిన భోజనం పెట్టారని ఈ విషయం సిబ్బందికి చెబితే తమనే దుర్భాషలాడారని విద్యార్థిని వాపోయింది. వసతులు లేకుండా తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపింది. కళాశాల సిబ్బంది వేధింపులు, నిర్లక్ష్యం వల్లనే తమ బిడ్డ ఇలా చేసిందని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనులపై అధికారులు శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-దర్శి


మాట్లాడుతున్న వైసీపీ ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి నియోజకవర్గంలో అధికారులు అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో పనులు జరగాల్సిన పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ కారణాల వల్ల ఆగిపోయిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దర్శిలో ఇంటింటికీ కుళాయి వెంటనే మొదలు పెట్టాలన్నారు. తాళ్లూరు మండలంలోని తాళ్లూరు, గంగవరం రోడ్డు, కురిచేడు మండలంలో కురిచేడు, పొట్లపాడు ఆర్అండ్‌బి రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎస్సీ, బీసీ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు అవసరమైన చోట జిల్లా పరిషత్ నిధుల నుంచి మంజూరు చేస్తామన్నారు. లోఓల్టేజీ సమస్య లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలన్నారు. జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి కూడా సిమెంటు, ఇనుము, మెటీరియల్ త్వరగా ఇచ్చి బిల్లులు చెల్లించాలన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదలయ్యేలా అధికారులు సహకరించాలని కోరారు. ఎంపీపీ గోళ్లపాటి సుధారాణి, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, గొర్రె మునలయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కేసరి రాంభూపాల్‌రెడ్డి, ఎంపీడీఓ హనుమంతరావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎం బాషా, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఏఎంసీ చైర్మన్ వెన్నపూస వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ ఆలీ, ఈఈ శ్రీనివాసరావు, డీఈ రంగారావు, ఆర్అండ్‌బి డీఈ కృష్ణ, పంచాయతీ రాజ్ డీఈ విరల్ రాథోడ్, విద్యుత్ ఈఈ షేక్ కరీమ్, డీఈ పిచ్చయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

7న దర్శికి షర్మిల రాక

ప్రజాశక్తి-దర్శి

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ఈ నెల 7వ తేదీన దర్శిలో జరిగే రచ్చబండ కార్యక్రమానికి రానున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్లూరి కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు అద్దంకి-పులిపాడు మధ్యలో కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతు, రైతు కూలీల సమస్యలపై రచ్చబండలో చర్చ జరుగుతుందన్నారు. షర్మిలారెడ్డితో సీడబ్ల్యూసీ మెంబరు కొప్పుల రాజు, మాజీ రాజ్యసభ సభ్యులు రామచంద్రరావు, సీడబ్ల్యూసీ మరో మెంబరు డాక్టర్ ఎన్ రఘువీరారెడ్డి, రుద్రరాజు, మాణిక్య రాగూర్, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-కొమరోలు

ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలోని అల్లీనగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లుగా విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్న కారణంగా అల్లీనగరం, ఎర్రగుంట్ల, తిమ్మారెడ్డిపల్లి గ్రామాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఫిజియో థెరపిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లాలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 13 మంది ఫిజియోథెరపిస్టుల సమస్యలు పరిష్కరించాలని శనివారం ఒంగోలులో డీఈవో, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వివిఎస్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాల పెంపు, మండలాలలో ఫిజియోథెరపీ క్యాంపులు పెంపు, మిగతా ఉద్యోగాలలో సర్వీస్ వెయిటేజ్ కోసం వివరించారు. దీనికి డిఈఓ, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వివిఎస్ సుబ్బారావు సానుకూలంగా స్పందించారు. తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఎంఒ, ఐఈ కోఆర్డినేటర్ రమేష్, జిల్లా ఎస్ఎస్ఏ ఫిజియోథెరపిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి డాక్టర్ అంకారావు, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ బ్రహ్మానాయక్, డాక్టర్ గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు వెళ్లి పింఛన్ అందించిన వాలంటీర్


ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని సచివాలయం-2 పరిధిలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మందా దేవమ్మ గత కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేక గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె పరిస్థితిని గమనించి వాలంటీర్ కొండేటి నైనబాబు గుంటూరులోని ఆసుపత్రికి వెళ్లి శనివారం పింఛన్ అందించారు. వాలంటీర్ నైనబాబు సేవలకు దేవమ్మ కుటుంబ సభ్యులు అభినందించారు.

రజక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని కొంగలవీడు రోడ్డులో మడియాల స్వామి గుడి ఆవరణలో రజక సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో అధ్యక్షులుగా పాలకవీటి బాలచెన్నయ్య, కార్యదర్శిగా సలిజామల పెద్దకాశయ్య, గౌరవ అధ్యక్షులుగా కొమరోలు శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.


రజక సంఘం నూతన కార్యవర్గ సభ్యులు



గ్రామస్థులతో మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు

సమస్యలు పరిష్కరిస్తా

మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు

ప్రజాశక్తి - వేటపాలెం

గ్రామంలో ప్రజల సమస్యలను రానున్న ప్రభుత్వంలో తాను పరిష్కారానికి కృషి చేస్తానని మాజీమంత్రి డాక్టర్ పాలేటి రామారావు అన్నారు. మండలంలోని చల్లారెడ్డి పాలెం గ్రామ పెద్దలతో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తాను శాసన సభ్యునిగా పోటీ చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ సీటు ఇస్తే పార్టీ తరపున పోటీ చేస్తానని, లేకుంటే స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీలో ఉంటానని పేర్కొన్నారు. స్పందించిన గ్రామ పెద్దలు ఎప్పటిలాగే తామందరం పాలేటితోనే కలిసి ప్రయాణం చేస్తామని తెలిపారు. గ్రామంలోని వివిధ సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై గ్రామ పెద్దలతో చర్చించిన ఆయన వచ్చే ప్రభుత్వంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గవిని రాధా, బాబు, దాసు, శ్రీనివాసరావు, గొల్లప్రోలు అంకయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆతిన నాగరాజు, పిట్టు రవి, గవిని గోపి , గని నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి కెపి బాలాజీ

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో దీర్ఘకాలంగా పరిష్కారం కానీ కేసులు పరిష్కారమయ్యే విధంగా పోలీసు అధికారులు, న్యాయవాదులు చర్యలు తీసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు, 6వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కెపి బాలాజీ కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో న్యాయమూర్తులు జి వాణి, ఎం పవన్ కుమార్, జి రుక్మిణీ, గడ్డం రేణుకలత, డిఎస్పి వెంకటేశులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ, న్యాయవాదులు నందనవనం ప్రసాదరావు, కంచర్ల అవినాష్, ఎస్ రవీంద్రబాబు, సిహెచ్ ప్రేమ్‌చంద్, సిహెచ్ ఆంజనేయులు, కుర్రా రవి, తటవర్తి రామకృష్ణ, సిహెచ్ రాజు, కొసనా వీరశేఖరరావు, వుసా క్రిష్ణ, మాధురి, శ్రీహరి పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాష

సమస్యలు తక్షణం పరిష్కరించాలి

ప్రజాశక్తి - చుండూరు

స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ప్రజా సమస్యలపై ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కలెక్టర్ పి రంజిత్ భాష, జాయింట్ కలెక్టర్ శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజల సమస్యలపై కలెక్టర్ నేరుగా వినతులు స్వీకరించారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రేపల్లె ఆర్డిఓ హేల షారూన్, పిడిఆర్డిఏ అర్జునరావు, తహశీల్దారు బి కనకదుర్గ, ఎంపిడిఓ అరుంధతిదేవి, ఎంపీపీ జాలాద్ రూబేను, చుండూరు సర్పంచ్ ఉయ్యూరు అప్పిరెడ్డి పాల్గొన్నారు.

7న షర్మిల జిల్లా పర్యటన

ప్రజాశక్తి - బాపట్ల



మాట్లాడుతున్న జేడీ శీలం

పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 7న జిల్లా పర్యటన జయప్రదం చేయాలని కాంగ్రెస్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం కోరారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి చీరాల కాంగ్రెస్ నాయకులు దేవరపల్లి రంగారావు సమన్వయకర్తగా వ్యవహరించారు. జెడి శీలం మాట్లాడుతూ జిల్లాలో జరిగే షర్మిల రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు డి దేవరాజు, పట్టణ అధ్యక్షురాలు రేణుక, రేపల్లె, వేమూరు, చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

పార్టీ అంగీకరిస్తే బాపట్ల నుంచే పోటీ

పంగులూరు: బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గ ప్రజలతో గత 25ఏళ్లుగా తనకు విడదీయరాని సంబంధం ఉందని, కాంగ్రెస్ అధినాయకత్వం అంగీకరిస్తే బాపట్ల పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా తాను పోటీ చేస్తానని మాజీ కేంద్రమంత్రి జెడి శీలం అన్నారు. శనివారం పంగులూరు వచ్చిన ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మళ్లీ మోడీ అధికారం లోకి వస్తే ప్రజాస్వామ్యం కూడా ఉండదని అన్నారు. కష్టపడి పని చేసే కష్టజీవులకు దక్కాల్సిన డబ్బులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడు తున్నాడని ఆరోపించారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీలకు చెందిన 26పదకాలను రద్దుచేసి తాను దళిత, గిరిజనులకు ఆప్తుడనని గొప్పలు చెప్పుకుంటున్నాడని విమర్శించారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

ఒంగోలు ఆర్డీవో వి.విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న ఒంగోలు ఆర్డీవో వి.విశ్వేశ్వరరావు

రానున్న సార్వత్రిక ఎన్నికలలకు సర్వంసిద్ధం చేసినట్లు ఒంగోలు ఆర్డీవో వి.విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించిన సమీక్షా సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో మాట్లాడుతూ త్వరలో రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను దష్టిలో పెట్టుకుని జిల్లా కేంద్రమైన ఒంగోలులో లెక్కింపు కేంద్రాల పరిశీలన, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన చేశామన్నారు. ఎన్నికల కోడ్ ప్రకటించిన తరువాత రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు, ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించిన అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కావలసిన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు,సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు పరిశీలన ,చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అన్ని పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేసి ఈనెల 8న ఓటర్ల జాబితాలు విడుదల చేస్తామన్నారు. కార్యక్రమం లో ఒంగోలు తహశీల్దార్ పి.మురళి, కొత్తపట్నం డిటి అర్జున్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధుల దామరాజు క్రాంతికుమార్, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి,కటారి సంజీవ్, ఎస్‌కె రసూల్, బసినేపల్లి రాజశేఖర్, గుర్రం సత్యం, సిపిఎం ప్రతినిధి జి. రమేష్, స్వరూప్, కట్టా శ్రీదేవి పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాలకు భరోసా జగనన్న

వైసిపి ఇన్‌ఛార్జి పానెం హనిమిరెడ్డి

ప్రజాశక్తి - అద్దంకి



న్యాయవాదులతో హనిమిరెడ్డి సమావేశం

ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక భరోసాను కల్పించి అండగా నిలిచింది సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని వైసిపి ఇన్చార్జ్ పాణ్యం హనిమిరెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో వైసీపీ న్యాయవిభాగం ఆధ్వర్యంలో న్యాయవాదులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా న్యాయవాదులకు నెలకు రూ.5వేల భృతి అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని గుర్తు చేశారు. చదువుకున్న మేధావులుగా న్యాయవ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న న్యాయవాదులైన మీరు ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరును ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు. వైసిపిని గెలిపించి సిఎం జగన్‌కు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమం లో పిఎల్‌ఎన్ ప్రసాద్, సలీం, రమేష్, అంజిరెడ్డి, ఉదయ్ భాస్కర్, గోపాల్, ప్రకాష్, న్యాయవాదులు పాల్గొన్నారు.



అర్జీ ఇస్తున్న యూనియన్ నాయకులు

కార్మికులకు జీతాలివ్వాలి

ప్రజాశక్తి - రేపల్లె

ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ జీతాలు అమలు చేయాలని, పండుగ కనుక రూ.వెయ్యి ఇవ్వాలని కోరుతూ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో కమిషనర్ రాంభూపాల్‌రెడ్డికి వినతిపత్రం శనివారం అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వం సరైన వేతనాలు అమలు చేయడంలేదని అన్నారు. ఇటీవల సమ్మె సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులకు రూ.21500వేతనం చెల్లించాలని కోరుతున్నామని అన్నారు. నైపుణ్యంతో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు, కంప్యూటర్ ఆపరేటర్లు, పార్కుల్లో పనిచేసే వాళ్ళకి, మేస్త్రిలు, విద్యుత్తు, మంచినీళ్ల విభాగంలో పనిచేస్తున్న స్కిల్డ్ వర్కర్ల అందరికీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎన్ రవిబాబు, కోశాధికారి కె రాఘవేంద్రరావు, బి యువరాజు, కె మావోబాబు, వి శ్రీనివాసరావు, ఎ సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళలకు అండగా జగన్మోహన్‌రెడ్డి

పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి - శింగరాయకొండ



చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి సురేష్

చంద్రబాబు ప్రభుత్వంలో మహిళలను మోసం చేశారని, అదే జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మహిళలకు అండగా నిలిచారని పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి, కొండేపి వైసిపి ఇన్చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో వైఎస్సార్ ఆసరా 4వ విడత కార్యక్రమం నిర్వహించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వాళ్లకి అండగా ఉన్నారన్నారు. డ్వాక్రాలో రుణమాఫీలతో పాటు ఆసరా, అమ్మ ఒడిలాంటి పథకాల్లో భాగస్వామ్యం చేసి, జగనన్న కాలనీలో మహిళలకు పట్టాలు అందించారని అన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రతి కార్యక్రమం మహిళలకే చేస్తూ ఉన్నారని అన్నారు. తొలుత జ్యోతి వెలిగించి దివంగత నేతల చిత్రపటాలకు నివాళి అర్పించారు. అనంతరం మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పీడీ వసుంధర, జడ్పీ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, ఎంపీపీ కట్ట శోభారాణి, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, ఎంపిడిఓ టి నాగేష్ కుమారి, జెసిఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - అద్దంకి



గొట్టిపాటి రవికుమార్

డీఎస్సీ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేస్తోందని, ఎన్నికల ముందు మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇన్నాళ్లూ కాలాయపన చేసిన సీఎం జగన్ రెడ్డికి ఇప్పుడు నిరుద్యోగులు గుర్తొచ్చారాని ఎంఎల్‌ఎ గొట్టిపాటి రవికుమార్ ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 50,896 పోస్టులు ఖాళీ ఉంటే కేవలం 6100పోస్టులకు అనుమతి ఇచ్చి మెగా అని చెప్పుకోవడం మోసం చేయడమేనని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ సర్వ నాశనమైందని అన్నారు. సీఎం సభ కోసం ఇంటర్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ పరీక్షను వాయిదా వేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. జగన్‌రెడ్డి సభ కారణంగా లక్షల మంది విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగిందని తెలిపారు. టీడీపీ పాలనలో రాష్ట్రాన్ని పెట్టుబడులకు హబ్‌గా మార్చితే జగన్‌రెడ్డి గంజాయికి హబ్‌గా మార్చారని ఆరోపించారు.



తహశీల్దారు, విఆర్‌ఓలను సన్మానిస్తున్న సిబ్బంది

తహశీల్దార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తహశీల్దారుగా పనిచేస్తున్న ధూళిపూడి వెంకటేశ్వరరావు ప్రకాశం జిల్లా ఇంకొల్లుకు బదిలీ అయ్యారు. ఆయనను కార్యాలయ సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. టైపిస్టుగా పని చేస్తూ పదోన్నతి పొందిన మహేష్‌ను, ఉత్తమ విఆర్‌ఒలుగా అవార్డులు పొందిన వెల్లటూరు, పల్లెకోన విఆర్‌ఒలు ఎం వినూష, ఎం బాల కోటేశ్వరరావును దృశ్యాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శివరామకృష్ణ, సర్వేయర్ బి శ్రీనివాసరావు, వీఆర్‌ఒలు గ్రేసమ్మ, రత్నాకర్, అంబటి ప్రసాద్, సురేష్, వెంకటేశ్వరరావు, నజరున్నీసా, రాంబాబు, కంప్యూటర్ ఆపరేటర్లు రాజేష్, దరియా పాల్గొన్నారు.

క్రీడల్లో రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉండాలి

క్రీడాకారులకు వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల

ప్రజాశక్తి-కనిగిరి

ఆంధ్రప్రదేశ్ క్రీడల్లో నంబర్ వన్‌గా ఉండాలన్న దృఢ సంకల్పంతో ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' ద్వారా క్రీడలను ప్రోత్సహించేందుకు యువతకు పెద్దపీట వేశారని కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. కనిగిరి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం కనిగిరి నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయిలో జరిగిన 'ఆడుదాం ఆంధ్ర' కోకో పోటీలో ప్రథమ బహుమతి సాధించిన బాలికల జట్టును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేస్తూ యువతను ప్రోత్సహించేలా భావితరాలకు మంచి భవిష్యత్తు అందించేలా సీఎం కృషి చేస్తున్నారన్నారు. యువత క్రీడల్లో రాణించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరు విశ్వవ్యాప్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీడి కాశీ విశ్వనాథరెడ్డి, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, కనిగిరి జడ్పిటిసి మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, సర్పంచులు పోతు రమణారెడ్డి, దమ్ము వెంకటయ్య, కాసుల పెద్ద గురవయ్య, వైసీపీ నాయకులు మూలే గోపాల్‌రెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోంది: టిడిపి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో అసమ్మతి పెరుగుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం యర్రగొండపాలెంలోని టిడిపి కార్యాలయంలో యర్రగొండపాలెం మండలం యూనిట్-2 నర్సాపాలెం గ్రామాల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం చేసిన అవినీతిని ప్రజలకు వివరించాలని అన్నారు. రాష్ట్రానికి జగన్‌రెడ్డి చేసింది శూన్యమని అన్నా రు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నియోజకవర్గంలో పరిష్కరించలేదని ఎద్దేవా చేశారు.



తహశీల్దారు కుటుంబాన్ని సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తహశీల్దారు మధుకు సత్కారం

ప్రజాశక్తి-చీమకుర్తి: చీమకుర్తి తహశీల్దారు పిన్నిక మధుసూదనరావును సిబ్బంది సత్కరించారు. సుదీర్ఘ కాలం చీమకుర్తి, సంతనూతలపాడు (ఎస్ఎసి) మండలాల తహశీల్దారుగా పనిచేసి ఎన్నికల బదిలీలో భాగంగా గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్ళుతున్నందున వారిని చీమకుర్తి తహసీల్దారు వారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ డి వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన చీమకుర్తి, సంతనూతలపాడు కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి చీమకుర్తి కార్యాలయ డిటిలు సాయి, శాంతి, సంతనూతలపాడు ఇడిటి శీలం శ్రీనివాసరావు, ఆర్ఎస్‌డిటి సుభాని, ఎఎస్ఒ రామచంద్రరావు, ఆర్ఐ శివరామిరెడ్డి, మండల సర్వేయర్ రాజేష్, సీనియర్ అసిస్టెంట్స్ కొండారెడ్డి, రమణయ్య, ఎపి విఆర్ఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి, చీమకుర్తి, సంతనూతలపాడు గ్రామ రెవెన్యూ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్స్, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి-కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మూరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రావూరి జనార్ధన్ శనివారం తెలిపారు. ఈ సమావేశానికి జడ్పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, ఎంపీటీసీలు కో ఆప్షన్ సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు హాజరవుతారన్నారు.



కలెక్టర్‌తో కనిగిరి మున్సిపల్ చైర్మన్ గఫార్

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి-కనిగిరి

ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మర్యాద పూర్వకంగాను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ అధికమవుతోందని, బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయిన దృష్ట్యా ఆ పనులను త్వరితగతిన చేపట్టాలని ఆయన కోరారు. బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే కనిగిరి మున్సిపాలిటీలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు ఉండదన్నారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు త్వరగా నష్టపరిహారం అదే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట బీసీ నాయకులు చింతలపూడి వెంకటేశ్వర్లు ఉన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు మహేష్

ఆటల్లో ఎన్ఎస్ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' ఆటలు పోటీల్లో ఎన్ఎస్ అగ్రికల్చరల్, హార్టికల్చర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభను చూపారు. యోగిత, దేవదివ్యని, గోపిక, చందన, పూజితరెడ్డి, మాధురి, స్వప్న, పూజిత, లక్ష్మీ ప్రసన్న, జాహ్నవి వీరు గత నెల జనవరి 24న ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' కాన్సెన్సీ లెవెల్‌లో వాలీబాల్ టోర్నమెంట్‌లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జనవరి 31న నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఫిబ్రవరి 3న ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ చేతుల మీదుగా మూడో బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్‌విఎస్‌కె రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారు బహుమతి సాధించేందుకు కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ మహేష్‌ను అభినందించారు.

సిల్వర్ మెడల్ సాధించిన 'డైట్' టీం

ప్రజాశక్తి-సంతనూతలపాడు



సిల్వర్ మెడల్ సాధించిన డైట్ విద్యార్థులు

'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా శుక్రవారం ఒంగోలు మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి మహిళా క్రికెట్ పోటీలలో మండలంలోని మైనంపాడు డైట్ కాలేజ్ విద్యార్థుల టీం సిల్వర్ మెడల్ సాధించినట్లు డైట్ ప్రిన్సిపాల్ అత్తోటి కిరణ్ కుమార్ తెలిపారు. డైట్ నుంచి మొట్ట మొదటిసారిగా పోటీలకు వెళ్లి జిల్లా స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించడం చాలా సంతోషకరమని అన్నారు. వీరికి కోచింగ్ ఇచ్చిన పీఈటి టి రవికుమార్‌ను ఆయన అభినందించారు. గెలుపొందిన క్రీడాకారులను ఎంపీడీవో కే రాఘవేంద్ర, గ్రామ పంచాయతీ కార్యదర్శి డి వెంకట్రావు అభినందించారు. కార్యక్రమంలో డైట్ సిబ్బంది పాండు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఎలా వస్తుందో చెప్పలేం.!

- శరీరంలో ఎక్కడైనా రావొచ్చు..
- మొత్తం 100కు పైగా రకాలున్నాయంటున్న వైద్యనిపుణులు
- జీవనశైలిలో మార్పులు తప్పనిసరి
- నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మారిన జీవనశైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్ల కారణంగా పురుషులు, మహిళలు అనే లింగభేదం లేకుండా చాలా మంది అనేక రకాల క్యాన్సర్ల బారిన పడుతున్నారు. క్యాన్సర్ ఎవరికి ఎప్పుడు ఎందుకు, ఎలా వస్తుందో చెప్పలేమని, క్యాన్సర్ శరీరంలోని ఏ భాగంలోనైనా రావొచ్చని వైద్య నిపుణులంటున్నారు. నోరు, ఛాతి, ఊపిరితిత్తులు, గొంతు, స్వరపేటిక, రొమ్ము, శ్వాసకోశ, ప్రోస్టేట్, పేగు, జీర్ణశయ, కాలేయ క్యాన్సర్లు వంటి దాదాపు 100కు పైగా క్యాన్సర్ రకాలున్నాయి. ఆదివారం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

గడిచిన 30 సంవత్సరాల్లో ప్రపంచ వ్యాప్తంగా 50 ఏళ్ల లోపు వయస్సు గల వారిలో క్యాన్సర్ కేసులు ఏకంగా 79 శాతం పెరిగాయంటే ఈ వ్యాధి ప్రభావం ఏ మేర వ్యాపిస్తుందో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో జరుగుతాయి. కొన్ని కారణాలతో ఆ కణాలు నియంత్రణ కోల్పోయి, చాలా వేగంగా, అనియంత్రితంగా (నియంత్రణ లేకుండా) విభజన చెంది కణ సమూహాలుగా ఏర్పడే స్థితినే క్యాన్సర్‌గా పిలుస్తారు. ఈ కణ సమూహాలను 'కణితి' (ట్యూమర్) గా పిలుస్తారు. క్యాన్సర్ కణాలు ముందుగా స్థానిక కణజాలంపై దాడి చేసి వాటిని నాశనం చేయడమే కాకుండా మన శరీరంలోని రక్తం, శోషరస వ్యవస్థ(లింఫటిక్ సిస్టమ్) ద్వారా ఇతర భాగాలకు వ్యాపిస్తాయి. ఇలా వ్యాపించే క్యాన్సర్‌ను మెటాస్టాటిక్ క్యాన్సర్‌గా పిలుస్తారు. క్యాన్సర్ బారిన పడిన వారిలో నిరక్షరాస్యత, వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడంతో



తీవ్రత పెరిగి ప్రాణాలు సైతం కోల్పోతున్నారు.

క్యాన్సర్ రకాలు కొన్ని..:

క్యాన్సర్ ప్రారంభమయ్యే కణ రకాన్ని బట్టి వివిధ రకాలుగా వర్గీకరించవచ్చు.

కార్సినోమా : క్యాన్సర్లలో కార్సినోమాలు అత్యంత సాధారణ రకం. ఈ క్యాన్సర్ చర్మంలో లేదా శరీరం లోపలి అవయవాలని కప్పి ఉంచే కణజాలంలో ప్రారంభమవుతోంది. ఇందులో బేసల్సెల్ కార్సినోమా, స్క్వామస్ సెల్ కార్సినోమా, ట్రాన్సిషనల్ సెల్ కార్సినోమా అనే ఉప రకాలు ఉంటాయి.

సార్కోమా : కనెక్టివ్ లేదా స పోర్టివ్ టిష్యుల్లో (ఎముక, మృదులాస్థి, కొవ్వు, కండరాలు లేదా రక్త నాళాలలో) ప్రారంభమయ్యే క్యాన్సర్‌ను సార్కోమాగా పిలుస్తారు. సార్కోమా క్యాన్సర్‌లో లియోమియో సార్కోమా, కపోసి సార్కోమా, ప్రాణాంతకఫైటరస్ హిస్టియోసైటోమా, లిపోసా ర్కోమా మరియు డెర్మాటో ఫైబ్రో సార్కోమా ప్రోటు బెరాన్స్ అనే ఉప రకాలు ఉంటాయి.

లుకేమియా : ఇది తెల్ల రక్తకణాల లో ఏర్పడే క్యాన్సర్. ఇది ఎముక మజ్జలో (బోన్ మ్యారో) రక్త కణాలను తయారు చేసే కణజాలంలో వస్తుంది.

లింఫోమా, మైలోమా : ఈ క్యాన్సర్లు రోగనిరోధక వ్యవస్థ కణాల్లో ప్రారంభమవుతాయి.

మెదడు మరియు వెన్నుపాము

క్యాన్సర్లు : ఇవి కేంద్ర నాడీ వ్యవస్థలో ఉత్పన్నమయ్యే క్యాన్సర్లు. చాలా క్యాన్సర్లలో 4 దశలు ఉంటాయి. శరీరంలో కణితి స్థానం మరియు పరిమాణం బట్టి దశ-1, దశ 2, దశ 3, దశ4లుగా వర్గీకరించవచ్చు.

క్యాన్సర్ లక్షణాలు:

- రాత్రుళ్లు ఎక్కువగా చెమట పట్టడం
- గొంతు మరియు ముక్కు నుంచి రక్తం కారడం.
- దగ్గు మానకుండా రావడం
- ఊపిరి ఆడకపోవడం.
- ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం
- మింగడంలో ఇబ్బంది పడడం, రక్త వాంతులు అవటం
- మూత్రంలో రక్తం, మూత్ర విసర్జన
- కొత్తగా కణితులు, పుట్టుమచ్చలు ఏర్పడటం
- నోటి లోపల చిన్నగా తెలుపు లేదా ఎరుపు బొబ్బలు రావడం
- రొమ్ములు, చనుమొలల్లో మరియు చర్మంలో మార్పులు రావడం..

క్యాన్సర్‌కు అందుబాటులో అధునాతన చికిత్స



ఇటీవల కాలంలో క్యాన్సర్‌కి అధునాతన ట్రీట్ మెంట్ విధానాలైన కిమోథెరపీ, రేడియేషన్ థెరపీ, హార్మోన్ థెరపీ, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ వంటి ఉత్తమ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. సర్జరీ సక్సెస్ రేటు క్యాన్సర్ రకం, తీవ్రతను బట్టి ఉంటుంది. జన్యు పరీక్షలు, రక్త పరీక్షలు, ఇమేజింగ్ పరీక్షలు బయాప్సీలు వంటి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్లను గుర్తించవచ్చు. క్యాన్సర్‌కు తొలి దశలోనే చికిత్స తీసుకోవడం ద్వారా క్యాన్సర్ మరణాల్లో దాదాపు సగానికి పైగా మరణాల రేట్లను తగ్గించవచ్చు. ఆహారపు అలవాట్లు, జీవనశైలిని మార్చుకోవడం ద్వారా క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు.

- డాక్టర్ ఎన్.రమణారెడ్డి, సర్జికల్ అంకాలజిస్ట్



వినతిపత్రం సమర్పిస్తున్న మెప్మా ఆర్పీలు

మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి

అధికారికి వినతి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గత 25 సంవత్సరాల నుంచి పట్టణ పేదల నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న మెప్మా ఆర్‌పిల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిద్దలూరు మెప్మా సిటీ మేనేజర్ ప్రసాద్‌కు గిద్దలూరు మెప్మా ఆర్‌పిల సంఘం వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సిఐటియు అనుబంధ మెప్మా ఆర్‌పిల సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి పద్మ, పి సాయిలక్ష్మి మాట్లాడుతూ మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, మెప్మా ఆర్పీలందరికి హెచ్‌ఆర్ పాలసీ అమలు, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఎస్ఎల్ఎఫ్‌ల మిర్చి ఆపాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, 15 సంఘాలలోపు ఉన్న ఆర్‌పిలందరికీ గౌరవేతనం ఇవ్వాలని, ఎస్ఎల్ఎఫ్ మిర్చిల వల్ల ఉపాధి కోల్పోయిన ఆర్‌పిలందరికీ నష్టపరిహారం ఇవ్వాలని, పొదుపు సంఘాలకు ఐదు లక్షల వరకు వడ్డీ రాయితీ ఇవ్వాలని, రూ.20 లక్షల వరకు జీరో వడ్డీ రాయితీ, డ్వాక్రా సభ్యులతో బలవంతపు వస్తువుల కొనుగోలు ఆపాలని, ఆర్పీలందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీల సంఘం నాయకులు ఎస్కే ఫాతిమా, డి రూతమ్మ, ఎస్కే గౌసియా, మహేశ్వరి, బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - పంగులూరు

ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఉండేందుకు, ఓటర్లకు, ఎన్నికల అధికారులకు కావలసిన సౌకర్యాలు తెలుసుకునేందుకు అధికారులు ఎన్నికల కేంద్రాలను శనివారం పరిశీలించారు. పంగులూరు, చిన్నమల్లవరం, ఆరికట్ల వారిపాలెం, కళ్ళం వారిపాలెరి, బూదవాడ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆరికట్లవారిపాలెం పోలింగ్ కేంద్రం మాత్రమే సమస్యాత్మకమైందని తెలిపారు. మిగతా వాటితో ఎలాంటి ఇబ్బంది లేదని సెక్టార్ ఆఫీసర్, ఎఒ కె సుబ్బారెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాల దగ్గర రాళ్లగుట్టలు గాని, కర్రల గుట్లలు కానీ ఉండరాదని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మంచినీళ్లు, బెంచిలు, కుర్చీలు వంటి సౌకర్యాలు పరిశీలించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ పివి స్వామి, వీఆర్ఏ కొనతం సుబ్బారావు పాల్గొన్నారు.

రూ.19.5 లక్షలు మంజూరు

ప్రజాశక్తి - పంగులూరు



సూపర్వైజర్ జయప్రద

మండలంలోని అంగన్‌వాడీ భవనాల మరమ్మత్తు పనులకు, నాడు- నేడు ఫేస్-2 క్రింద రూ.19.5లక్షలు మంజూరైనట్లు అంగన్‌వాడి పంగులూరు సెక్టార్ సూపర్వైజర్ జయప్రద తెలిపారు. శనివారం పంగులూరు వచ్చిన సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో 55అంగన్ వాడీ కేంద్రాలు ఉండగా అందులో 23 అంగన్‌వాడీ కేంద్రాలు రిపేర్ పనులు నిమిత్తం నాడు నేడు ఫేస్-2లో ప్రతిపాదించినట్లు తెలిపారు. కరెంటు, టాయిలెట్లకు, తాగునీటి వసతి, వాల్ పెయింటింగ్ వంటి పనులకు ఈనిధులు ఖర్చు చేయాల్సి ఉందని తెలిపారు. రిపేర్ పనులకు అయిన ఖర్చులను ఈ అకౌంట్లో ప్రభుత్వం డబ్బు జమ చేస్తుందని తెలిపారు. అందుకోసం స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో అకౌంట్లు ఓపెన్ చేస్తున్నామని చెప్పారు. పనులను త్వరగా పూర్తిచేసి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

ఎంపీడీఒగా ఫణికుమార్ నాయక్

ప్రజాశక్తి - కొత్తపట్నం

నూతన ఎంపీడీఒగా ఆర్ ఫణికుమార్ నాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా గురజాలలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించి పరిచయం చేసుకున్నారు.



ఫీల్డ్ అసిస్టెంట్ నియామక పత్రం అందిస్తున్న ఎంపీపీ

నియామక పత్రం అందజేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్ఆర్ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పిల్లి అనిల్ కుమార్‌కు ఎపీఓ పి శివపార్వతి జారీ చేసిన నియామక పత్రాన్ని ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి టి ఉదయభాస్కరి చేతుల మీదగా శనివారం అందజేశారు. ఇప్పటివరకు పోస్టు ఖాళీగా ఉందని, పనులు ప్రారంభం కానున్న దృష్ట్యా నియమకం చేపట్టినట్లు చెప్పారు. నూతన ఎంపీడీఒ మల్లికార్జునరావు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ సిబ్బంది దుశ్శాలవాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మురుగుడు శ్రీనివాసరావు, నన్నెపాముల చంటి, కౌతరపు పద్మావతి, కుమారి భాయి, రావు రాజేశ్వరి పాల్గొన్నారు.

పిఏసిఎస్ స్థలాన్ని పరిరక్షిస్తాం

జిల్లా సహకార అధికారి రామారావు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి సంబంధించిన అద్దేపల్లి గోడౌన్ స్థలాన్ని ఎలాంటి ఆక్రమణకు గురి కాకుండా పరిరక్షిస్తామని సహకార శాఖ జిల్లా అధికారి రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్థలం టిఎస్-ఎస్‌కు సంబంధించినదని తెలిపారు. సుమారు నాలుగున్నర సెంట్ల స్థలాన్ని సహకార సంఘానికి అవసరమైన గోడౌన్ లేదా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. స్థలాన్ని ఎవరైనా ఆక్రమించాలని ప్రయత్నిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈపాటికే స్థల ఆక్రమణపై లోకయుక్త, హైకోర్టులో పిటిషన్ దాఖలై ఉందని తెలిపారు. దీనిని అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత సొసైటీ అధికారులపై ఉందన్నారు. ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారికి ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. రికార్డు ప్రకారం సొసైటీకి సంబంధించిందేనని అన్నారు. అక్రమ కట్టడాలను పూర్తిగా తొలగించి ఫినిషింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ మేరకు సంబంధిత పిఎసిఎస్ అధికారులకు ఆదేశాలు ఇస్తామని తెలిపారు.



పిఎసిఎస్ స్థలంలో పెరిగిన కంపచెట్లు

సువర్ణమాల మృతికి కారణమైన

రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వేటపాలెం

సిలోన్ కాలనీలో వాచ్మెన్ రామకృష్ణారెడ్డి ఆక్రమించుకుని సాగు చేస్తున్న భూమి నుండి తొలగించాలని మండలంలోని దేశాయిపేట పంచాయతీ సిలోన్లో కాలనీలో ప్రజలు డిమాండ్ చేశారు. కాలనీలో శనివారం జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో కాలనీ సంఘం నాయకులు మాట్లాడారు. సమస్యను పోలీసులే తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కరెంటు డిపార్ట్మెంట్ పేరు చెప్పి తమ కాలనీ భూమిని వాచ్‌మెన్ ఆక్రమించుకుని సాగు చేస్తున్నాడని చెప్పారు. అతన్ని తమ భూమినుండి తొలగించాలని తాము కోరుతుంటే వాచ్మెన్ రామకృష్ణారెడ్డికి పోలీసులు అండగా ఉంటున్నారని ఆరోపించారు. జనవరి 3న వాచ్మెన్ రామకృష్ణారెడ్డి తమ కాలనీకి చెందిన కోళ్లను చంపాలని కాళ్లు విరగొట్టాడని, అడిగిన కాలనీ ఆడవారిని అసభ్యంగా తిట్టి అవమానాలకు గురి చేసినప్పుడూ ఎస్పైకి ఫిర్యాదు చేశామన్నారు. ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. జనవరి 28న వాచ్మెన్ కాలనీలోని ఆడ వారితో గొడవ పెట్టుకోవడంతో మరోసారి పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. అతనిపై కేసు పెడుతున్నారని తెలుసుకుని పురుగు ముందు తాగినట్లు నటించి నారాయణ ఆసుపత్రిలో చేరి కాలనీవాసులపై ఎదురు కేసులు నమోదు చేయించాడని తెలిపారు. తమపై కేసులు పెడతామని బెదిరించడంతో వైసిపి ఇన్చార్జ్ కరణం వెంకటేష్ బాబు వద్దకు సువర్ణ మాలతో సహా కాలనీ వాసులందరూ వెళ్లినట్లు తెలిపారు.



సమస్య వివరిస్తున్న తమిళ కాలనీ ప్రజలు, నాయకులు

సమస్యలు విన్న కరణం వెంకటేష్ ఎస్ఐకి ఫోన్ చేసి స్పీకర్ పెట్టి మాట్లాడారు. వాచ్మెన్ ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ఉందని, అతనికి ఏదైనా జరిగితే కాలని వారిదే బాధ్యతని, అందరినీ అరెస్టు చేస్తామని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అక్కడే ఉన్న కాలనీ నాయకురాలు సువర్ణ మాల తీవ్రంగా భయపడి మనోవేదకులోనై బీపీ డౌన్ కాగా కుప్పకూలిపోయారు. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యానికి గుంటూరు జనరల్ ఆస్పత్రికి పంపగా అక్కడే ఆమె మృతి చెందారు. ఆ స్థలంలోకి వెళ్ళవద్దని వాచ్‌మెన్‌కు ముందు రోజే తహశీల్దారు కాలనీకి వచ్చిన సందర్భంగా చెప్పారు. తమను ఇబ్బందులకు గురిచేస్తున్న అతనిపై చర్యలు తీసుకోవాలని, తమపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. కాదశీకుల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పి కొండయ్య, సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు, ఐద్వా నాయకురాలు అల్లిరాణి, కాలనీ నాయకులు సత్యవేలు, శివనాడియన్, పి కర్ణ పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్ ఆవేదన

ప్రజాశక్తి - కర్లపాలెం

మండలంలోని తుమ్మలపల్లిలో జగనన్న కాలనీకి ఏర్పటు చేసిన స్థలంలో పెద్ద చెరువు ఉండేదని, దానిని ఇసుకతో పూడ్చి మూడేళ్లు గడిచినప్పటికీ బిల్లు ఇంత వరకు ఇవ్వలేదని కాంట్రాక్టర్, బాధితుడు వేంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆవేదనను విలేకరలతో చెప్పుకున్నారు. జగనన్న కాలనీ మెరక ఇసుక తోలి మూడేళ్లు అయ్యిందని తెలిపారు. ఇప్పటికీ బిల్లు రాలేదని, ముగ్గురు ఎంపిడిఒలు మారారని అన్నారు. స్థానిక ఎంఎల్ఎ కోన రఘుపతి ఆదేశాల మేరకు జగనన్న కాలనీకి ఇసుక తోలిన తనకు చెల్లించాల్సిన బిల్లులు ఇవ్వకుండా ఎలా రిజిస్ట్రేషన్లు చేస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రఘుపతి దగ్గరకు ఎన్నిసార్లు వెళ్లినా తనకు న్యాయం జరగలేదని అన్నరు. తనకు రావలసిన బిల్లులు ఇచ్చేవరకు రిజిస్ట్రేషన్ల చేయడానికి లేదని పేర్కొన్నారు. పనులు చేయడానికి తాను అప్పులు చేయడంతోపాటు తనకున్న రెండు ఎకరాల భూమిని కూడా అమ్ముకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు తన సమస్య పరిష్కరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.



సమావేశంలో కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు

సాహితీవేత్త అన్నమనేనికి ఘన సత్కారం

ప్రజాశక్తి - అద్దంకి

ఎండ్లూరి సుధాకర్ స్మార్త కళావేదిక నందు ఎండూరు సుధాకర్ సాహిత్య జీవిత విశేషాలను సినీ సంగీత రాజకీయ విమర్శకులు అన్నమనేని వెంకటరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. జాషువా జీవితం గురించి పీహెచ్డీ చేసి సాహిత్య రంగానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ముందుగా ఎన్టీఆర్, ఎండ్లూరి సుధాకర్ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులు అర్పించారు. వారణాసి రఘురాం శర్మ ఎన్టీఆర్ నటించి, దర్శకత్వం వహించిన సీతారామ కళ్యాణం సినిమా విశేషాలను గురించి వివరించారు. రామారావు దర్శకత్వం వహించిన తొలి చిత్రం అన్నారు. తానే నెగిటివ్ పాత్ర పోషించి సంగీత, సాహితీ ప్రపంచాన్ని ఆనందంతో ఉప్పొంగిందని అన్నారు. దానవీరశూరకర్ణ, శ్రీకృష్ణ పాండవీయం పునాదిగా చెప్పుకోవడానికి వీలుందని రఘురాంశర్మఅన్నారు. అనంతరం అన్నమనేని వెంకటరావుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పిసిహెచ్ కోటయ్య, వీరవల్లి సుబ్బారావు, రుద్రయ్య, నందమూరి కళాపరిషత్ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, ఆర్‌వి రాఘవరావు, డాక్టర్ యు దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, సందిరెడ్డి శ్రీనివాసరావు, లేవి ప్రసాద్, డివిఎం సత్యనారాయణ, దివాకరదత్తు, చిన్ని మురళీకృష్ణ, చెన్నుపాటి రామాంజనేయులు, యోగేశ్వరరావు, ఎస్‌కె రఫీ, ఎంహెచ్ రావు, వివి బ్రహ్మం, ఎస్‌కె కాసిం, రజనీకాంత్ పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో వనమ రామకృష్ణరావు

ఫార్మా కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ముంబాయి ప్రధాన కేంద్రంగా కలిగిన అలింబిక్ ఫార్మసూటికల్స్ లిమిటెడ్ కంపెనీ ఎంబిఎ, ఫార్మసి విద్యార్థులకు ఇటీవల క్యాంపస్ ఎంపికలు నిర్వహించింది. ఎంపికల్లో 12 విద్యార్థులు ఉద్యోగాలు సాదించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు తెలిపారు. ఫార్మాసూటికల్ కంపెనీలలో ఒక్కటైన అలెంబిక్ ఫార్మమాలికల్స్కంపెనీ ఆవిర్భావం, ఎంపిక కాబోయే విద్యార్థులకు ఉండవలసిన లక్షణాలు, భాధ్యతలు, కంపెని కల్పించే సౌకర్యాలు ఆన్లైన్లో పవర్ పాయింట్ ద్వారా తెలిపారు. ఎంపికలకు 40మంది హాజరు కాగా 12మంది ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు, ప్రాంగణ ఎంపికల అధికార ఎన్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రు.3లక్షల జీతం, ఇతర అలవెన్సులు ఇస్తారని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఫార్మసి ప్రిన్సిపాల్ డాక్టర్ వివి నాగేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ ఆర్ ఇమ్మానియేల్ అభినందించారు.

మాజీ సైనికోద్యోగి మృతి

ప్రజాశక్తి - పంగులూరు



గంధం జోసెఫ్

మాజీ సైనికోద్యోగి గంధం జోసెఫ్ (62) గుండెపోటుతో శనివారం చిన్నగంజాంలో మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామమైన పంగులూరు తీసుకొచ్చారు. కనిగిరి ప్రాంతానికి చెందిన గంధం జోసెఫ్ మిలిటరీలో పని చేసేవాడు. పంగులూరు గ్రామానికి చెందిన వైద్య ఉద్యోగి పాలపర్తి ఝాన్సీ రాణిని పెళ్లి చేసుకుని పంగులూరులోనే నివాసం ఉన్నాడు. ఝాన్సీరాణిని చిన్నగంజాం బదిలీ కావడంతో గత ఏడాది కాలంగా అక్కడే ఉంటున్నారు. శనివారం బాత్రూంకి వెళ్ళిన జోసెఫ్ గుండెపోటు రావడంతో అక్కడే మరణించాడు. ఆయనకు కుమారుడు హైదరాబాదులో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె దుబాయ్‌లో ఉంటుంది. మిలటరీ నుండి వచ్చిన తర్వాత జోసెఫ్ కొంతకాలం ఎంఆర్పిఎస్ నాయకుడిగా పనిచేశాడు. 1995లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ జడ్పిటిసిగా పోటీ చేసి ఓడిపోయాడు. దుబాయ్ నుండి కుమార్తె, అల్లుడు రావాల్సి ఉండగా సోమవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - కొల్లూరు

జాతీయ రహదారి రోడ్డు భద్రత అవగాహన సదస్సు స్థానిక వెంకటేశ్వర ఏజెన్సీ ఇండియన్ ఆయిల్ బంక్ ఆవరణలో శనివారం నిర్వహించారు. సదస్సుకు సిఐ ప్రసన్నకుమారి అధ్యక్షత వహించారు. సదస్సులో ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ డాక్టర్ బి కృష్ణవేణి మాట్లాడుతూ జీవితంలో అనేక రవాణా ప్రయాణాలు ఉంటాయని అన్నారు. రోడ్డుపై నడవడం, ప్రయాణ నిబంధనలను చిన్నతనం నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర కుమార్, ఎన్జిఒ శ్రవణ్ కుమార్, లారీ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్, తెనాలి ఎస్‌బిఐ మేనేజర్ భరద్వాజ్ పాల్గొన్నారు.

రోజు మార్చి రోజు నీటి సరఫరా

ప్రజాశక్తి - బాపట్ల

నీటి ఎద్దటి దృష్ట్యా పురపాలక సంఘ పరిధిలో ఆదివారం నుండి రోజు మార్చి రోజు మంచినీటి సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ డిఈ శ్రీనివాసులు శనివారం తెలిపారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

హెల్త్ మల్టీ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో ఉదయం 9నుండి 2వరకు గుండె జబ్బుల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కరి కమలేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు.



డ్యామ్‌లో చేప పిల్లలను వదులుతున్న మంత్రి నాగార్జున

బాబు వస్తే పథకాలు పోతాయి

మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - మద్దిపాడు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు గెలిస్తే వైసిపి చేపట్టిన సంక్షేమ పథకాలు పోతాయని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆసరా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలోనే అమలవుతున్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మరల జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైసిపి మండల అధ్యక్షులు మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి పాల్గొన్నారు.

మద్దిపాడు : మత్స్యకారులకు వైసీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్టులో శనివారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల జీవనభృతి కోసం ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, వైసిపి మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైసీపీ నాయకులు పుల్లారావు పాల్గొన్నారు.

పెద్దిపోగుకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి - మద్దిపాడు

మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పెద్దిపోగు కోటేశ్వరరావుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు విలేకరుల సమావేశంలో శనివారం మాట్లాడారు. ఆ సంఘం రాష్ట్ర ఇన్చార్జి జడ ఇమ్మానుయేలు రాజు, జిల్లా ఉపాధ్యక్షులు తెళ్ళ ఉమేష్ మాట్లాడుతూ పెద్దిపోగు కోటేశ్వరరావు 30ఏళ్లుగా ప్రజా పోరాటంలో ఉన్నారన్నారు. సంతనూతలపాడు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - మద్దిపాడు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు ఉబ్బ ఆదిలక్ష్మి కోరారు. ఎంఈఒకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు తన పాదయాత్రలో తాము అధికారంలోకి వస్తే రూ.10వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చాడని, ఆ హామీని అమలు చేయాలని కోరారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని, తదితర డిమాండ్స్‌ను నెరవేర్చాలని కోరారు. మరియమ్మ, సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

నేడు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

స్థానిక రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ 33వ వార్షికోత్సవం సందర్భంగా రావిపూడి వెంకటాద్రి మీటింగ్ హాల్, రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ ఆవరణలో నేడు ప్రకాశం, బాపట్ల జిల్లాల స్థాయిలో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహిస్తున్నట్లు సెంటర్ అధ్యక్షులు మేడూరి సత్యనారాయణ తెలిపారు. మధ్యాహ్నం 2నుండి 5గంటల వరకు పోటీలు జరుగుతాయని అన్నారు. 6, 7తరగతులకు మత మూఢ విశ్వాసాల నిర్మూలన అంశం పై, 8, 9, 10 తరగతులకు లౌకికవాదం- భారత రాజకీయాలు అంశంపై, ఇంటర్మీడియట్‌కు ప్రజాస్వామ్యం - భారత రాజకీయాలు అంశంపై వ్యాసరచన, 6, 7తరగతులకు సైన్సు - టెక్నాలజీ ఉపయోగాలు అంశం పై, 8, 9, 10తరగతులకు వైజ్ఞానిక దృక్పథం అంశంపై, ఇంటర్మీడియట్‌కు భారత రాజ్యాంగం- ప్రజాస్వామ్య విలువలు అంశంపై ఉపన్యాస పోటీలు జరుగుతాయని అన్నారు. వ్యాస రచనకు 1గంట, ఉపన్యాసానికి 5నిమిషాలు సమయం ఉంటుందని అన్నారు. హాజరయ్యే విద్యార్థులు హెచ్ఎంల నుండి సర్టిఫికేట్లతో రావాలన్నారు. వివరాలకు 9849935117 సంప్రదించాలని కోరారు.

మహిళా పక్షపాతి జగన్: మంత్రి

ప్రజాశక్తి - టంగుటూరు

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అనేక సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే వారికి సంపూర్ణ ప్రయోజనం చేకూరేలా చేస్తున్న సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రమే అని పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి, కొండపి వైసిపి ఇన్చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 4వ విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 3విడతల్లో మహిళలను ఆసరా ద్వారా ఆదుకున్న ప్రభుత్వం 4వ విడత అక్క, చెల్లెమ్మలందరికీ ప్రయోజనం చేకూరేలా, ఆర్థిక భరోసా కల్పించేలా ఆసరా చెక్కుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా బడ్జెట్‌ను అప్పుల ఊబిలోకి నెట్టి వెళ్లిన చంద్రబాబు ప్రభుత్వం తలదించుకునేలా రాష్ట్ర బడ్జెట్ అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ అనేక సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హులందరికీ అందిస్తున్నట్లు చెప్పారు. తొలుత టంగుటూరు విచ్చేసిన మంత్రి సురేష్‌కు వైసీపీ నాయకులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. మండలంలోని 1426 పొదుపు గ్రూపులలోని 13,741 మంది మహిళలకు రూ.11.52కోట్ల మేర నగదును నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి వసుంధర, డిపిఎం సనిత, ఏపిఎం టి హనుమంతరావు, ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, వైసీపీ మండల అధ్యక్షులు మల్లవరపు రాఘవరెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, జడ్పిటిసి మన్నం అరుణ కుమారి, ఎంపీడీఓ నారాయణరావు, ఏపీఓ ఎం సుభాషిణి, సర్పంచ్‌లు ఉప్పలపాటి శివరామరాజు, బిళ్ళా ఝాన్సీ రాణి, ఉప్పలపాటి సుబ్బరాజు, ఉప్పలపాటి నాగరాజు, ఎంపీటీసీలు కొమ్ము ప్రభుదాసు, బొడ్డు వాసంతి, మేదరమెట్ల భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

పని ఒత్తిడి పెంచే వైఖరి మార్చుకోవాలి

ప్రజాశక్తి - కొండపి

అదికారులు, ప్రభుత్వం వ్యవసాయ సహాయకులపై పని ఒత్తిడి పెంచే వైఖరి మార్చుకోవాలని వ్యవసాయా సహాయకుల సంఘం అద్యక్షులు జె కొండలరావు, కార్యదర్శి టివి వెంకటనారాయణ కోరారు. బాపట్ల జిల్లా మేముల మండలం చావలి రైతు భరోసా కేంద్రంలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎపి ఆర్‌బికె ఉద్యోగుల సంక్షేయ సంఘం మహిళా కార్యదర్శి బెల్లంకొండ పూజిత పని ఒత్తిడి, అదికారులు వేదింపులు భరించలేక 1న ఆత్మహత్య చేసుకున్నారు. ఈసందర్భంగా స్థానిక వ్యవసాయ కార్యాలయం నందు పూజిత చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగస్తులు ఇలాంటి కఠినమైన నిర్ణయాలను తీసుకు న్నారంటే ఎంత మానసికంగా ఒత్తిడికి గురి అయ్యారో అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అదికారులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే దైర్యం కోల్పోకుండా తోటి ఉద్యోగస్తులతో చర్చించి పరిష్కరిచ్చుకోవాలని, ఇటువంటి కఠినమైన నిర్ణయాలను తీసుకోవద్దని కోరారు. ఆమె కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఉపాద్యక్షులు కె శ్రీకాంత్, కోశాదికారి డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పవిత్ర చిత్రపటానికి నివాళి అర్పించిన విఏఏలు

తెలుగుదేశంతోనే అభివృద్ధి

కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

ప్రజాశక్తి - శింగరాయకొండ

తెలుగుదేశంతోనే గ్రామాలు అభివద్ధి చెందాయని కొండేపి ఎంఎల్ఎ డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి అన్నారు. మండలంలోని పాకల గ్రామంలో బాబు షఉరిటి, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టోను ఇంటింటికి వెళ్లి వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబును గెలిపించుకుంటే మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యంతో పాటు ఉచితంగా మూడు సిలిండర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్రామాల్లో అభివద్ధి కుంటుపడిందని, తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాలను అభివద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సైకం చంద్రశేఖర్, కన్నా శ్యాంప్రసాద్, బత్తుల రాజగోపాల్‌రెడ్డి, వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

రాజకీయంగా ఎదుర్కోలేకే దాడులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రశాంతంగా ఉన్న పర్చూరు నియోజకవర్గంలో అలజడి సృష్టించాలని చూస్తే ఊరుకునేది లేదని టిడిపి బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ హెచ్చరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కామినేని జనార్ధన్, టిడిపి మైనార్టీ సెల్ కార్యదర్శి రజాక్, వైస్ ఎంపీపీ దాసం అశోక్, శివ మాట్లాడారు. ఎమ్మెల్యే ఏలూరిపై రాజకీయంగా గెలవలేమనే భయంతో రౌడీ రాజకీయానికి తెర తీసాడని ఆరోపిం చారు. సంబంధంలేని విషయంలో కేసులు పెట్టి ఎంఎల్ఎను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నారని అన్నారు. ఆమంచికి దమ్ముంటే అభివృద్ధిలో పోటీ పడాలని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఏలూరి కష్టపడి ఉద్యోగం చేసి తన తెలివితేటలతో కంపెనీ ప్రారంభించి రైతన్నలకు సేవలు అందిస్తూ ప్రజల ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చారని గుర్తు చేశారు. కానీ ఆమంచి తన స్థాయిని, తాను చేసిన వ్యాపారాలను మరచి ఎమ్మెల్యే ఏలూరిపై ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. బొగ్గు వ్యాపారం చేసి అక్రమాలకు పాల్పడి, జడ్పిటిసిగా, ఎమ్మెల్యేగా ఇప్పుడు ఇన్చార్జిగా వచ్చి ఇసుక మైనింగ్ మాఫియాకు పాల్పడుతుంది నిజం కాదాని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి నాయకులు మిన్నకంటి రవి, అడుసుమల్లి శ్రీనివాసరావు, మక్కెన శేఖర్ బాబు, మస్తాన్ వలి, మహిళా అధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు ఆదినారాయణ

కారంచేడు : మాజీ ఎఎంసి చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి మాట్లాడుతూ వైసిపి ఇన్చార్జ ఆమంచి కృష్ణమోహన్ వచ్చిన తర్వాత నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అవినీతి, గుండాయిజం, అక్రమ దందాలు పెరిగాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు కంభంపాటి నరేంద్ర, వార్డు మెంబర్ పాతూరి ఆదిలక్ష్మి, పాతూరి శివరాం, బోయిన శీను, విలేకరి శీను, ఆంజనేయులు, గద్య సుబ్బయ్య, కొల్లా భాస్కరరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోష్టుమాష్టర్ రామారావు

పోస్టాఫీసు కార్యకలాపాలపై అవగాహన

ప్రజాశక్తి - చీమకుర్తి

పోస్టాఫీసు కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహనా నిర్వహించారు. స్థానిక విద్యానికేతన్ విద్యార్థులు విజ్ఞాన పర్యటనలో భాగంగా పోస్టాఫీసును శనివారం సందర్శించారు. ఈ సంధర్భంగా సబ్ పోష్టమాష్టర్ కె రామారావు విద్యార్థులకు లెటర్ బుకింగ్, మనియార్డర్, సేవింగ్ ఎకౌంట్, రికరింగ్ డిపాజిట్లు, ఎస్ఎస్ఏ టిడి, ఎన్ఎస్‌సి బాండ్లు, మహిళా సమాన్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోష్టల్ అధికారులు వాసుబాబు, మస్తాన్‌వలి, ఉపాధ్యాయుడు కె వెంకట్ పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థినిలకు ఉపాధ్యాయుల అభినందన

విద్యార్థినులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - శింగరాయకొండ

ఆడుదాం-ఆంధ్ర జిల్లా స్థాయి కబడ్డీ మహిళా పోటీల్లో మండలంలోని పాకల జెడ్‌పి హైస్కూల్ విద్యార్థినిలు విజేతగా నిలిచినట్లు హెచ్ఎం డివిఎస్ ప్రసాద్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు ఒంగోలు మినీ స్టేడియంలో జనవరి 31 నుండి ఫిబ్రవరి 2వరకు జరిగాయి. కొండపి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన పాకల మహిళల కబడ్డీ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఎనిమిది నియోజకవర్గాల మధ్య జరిగిన రసవత్తమైన పోరులో పాకల విద్యార్థినిలు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. జిల్లాలో ప్రథమ స్థానం వహించిన జట్టుకు మెడల్స్, రూ.60వేల నగదు, సర్టిఫికెట్స్‌ను అందజేసినట్లు తెలిపారు. తమ జట్టు ఫిబ్రవరి 9 నుండి 13వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు పిఇటి పి హజరత్తయ్య తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థినిలను సన్మానించారు. రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి పాకల గ్రామ పేరు ప్రతిష్టలను ఇనుమడింప జేయాలని ఆకాంక్షించారు.

భూహక్కు పత్రంతో ప్రయోజనం

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

దళిత భూహక్కు పత్రంతో దళితులకు ప్రయోజనం చేకూరుతుందని సాంఘిక శాఖ మంత్రి, సంతనూతలపాడు వైసిపి ఇన్‌ఛార్జి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న దళిత భూహక్కు పత్రం పంపిణీకి హాజరయ్యారు. సభకు ఎంపిపి నలమలపు అంజమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ తాను దళితుల సమస్యను సిఎం జగన్ మోహన్‌రెడ్డికి తెలపడంతో వెంటనే స్పందించి అందరికీ భూహక్కు పత్రం అందచేయాలని ఆదేశించారని చెప్పారు. దాంతో కార్పొరేషన్‌లో ఉన్న దళితుల రుణాలను రద్దు చేసి జగనన్న దళిత భూహక్కు పత్రం పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. తద్వారా పట్టా పొందినవారికి భూమిపై పూర్తి హక్కు కలగడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రాయితీలు వర్తిస్తాయని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇడి అర్జున్ నాయక్, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకారావు, నలమలపు కృష్ణారెడ్డి, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు కంచర్ల సుధాకర్, పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయకుమార్, పోలినేని కోటయ్య, ఎంపిటిసి మున్నంగి వెంకట్రావు, జి హరిబాబు, ఇ అంజయ్య, కాట్రగడ్డ శ్రీను, ఇమ్మిశెట్టి బాలకృష్ణ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

పట్టుదలతో శ్రమిస్తే మంచి ఫలితాలు

- ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు
- లక్ష్మణరావును ఘనంగా సన్మానించిన కళాశాల నిర్వాహకులు

ప్రజాశక్తి-చీరాల

సరైన ప్రణాళికతో పట్టుదలతో శ్రమిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి సభ్యులు కేఎస్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో వివిధ ప్రజాసంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్రూప్ 2 శిక్షణా తరగతులకు ఆయన శనివారం హాజరై భారతీయ సమాజం అనే అంశాన్ని ఆయన బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్లో విడుదల చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్ కి నిరుద్యోగ అభ్యర్థుల నుంచి విశేషమైన స్పందన లభించిందని ఈనెల 25న ప్రిలిమ్స్ పరీక్ష జరగనున్నాయని అన్నారు. ఈ పరీక్షకు లక్షల మంది అభ్యర్థులు పోటీపడుతున్న కొద్ది మంది మాత్రమే సరైన ప్రణాళికతో చదివి పరీక్షలకు సిద్ధమవుతున్న వారు ఉన్నారని అలాంటివారు కచ్చితంగా ఫలితాలు సాధిస్తారని అన్నారు. ఈ క్రమంలో చీరాల సెయింట్ మార్క్స్ లూథరన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో ఈ ప్రాంతంలో విద్యార్థిని విద్యార్థులకు ఉపయోగపడే విధంగా గ్రూప్ -2 శిక్షణ తరగతులు కళాశాల యాజమాన్యం సిబ్బంది వివిధ ప్రజా సంఘాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. స్టేట్ ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ రాయుడు రవి కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత శిఖరాలు చేరుకునే విధంగా గతంలో అనేక సంవత్సరాలుగా శిక్షణను ఏర్పాటు చేసినట్లు దానికి కొనసాగింపుగా లుథరన్ జూనియర్ కళాశాల వారు గ్రూప్- 2 క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, ప్రిన్సిపాల్ పి. సునీత, ఆంధ్రప్రదేశ్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల రాష్ట్ర అధ్యక్షులు గారపాటి పుష్ప రాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మనోజ్, ఆర్య, డిబిఆర్సి కోఆర్డినేటర్ వి భగవాన్‌దాస్ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కుర్రా రామారావు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ జానీ బాషా పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- మార్చి 1 నుంచి 20 వరకు పరీక్షల నిర్వహణ
- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో మార్చి 1 నుండి 20వ తేది వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను సజావుగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించేలా చూడాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం తన ఛాంబర్‌లో ఆయన ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉదయం 8.30 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విదంగా ఆర్టీసి బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీలత, ఆర్ఐఓ ఏ.సైమన్ విక్టర్, డిఎస్పి వి.నారాయణ స్వామి రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మానవ వనరులను సమకూర్చుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సాధారణ ఎన్నికల నిర్వహణకు అవసరమైన మానవ వనరులు అధికారులు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఎన్నికల నిర్వహణపై అన్ని శాఖల జిల్లా అధికారులతో శనివారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధి నిర్వహణలో అధికారులకు నిర్లిప్తత ఉండరాదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల మార్గదర్శకాలను అనుసరించి జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాల్సి ఉందని స్పష్టం చేశారు. సొంత నిర్ణయాలు ఏమాత్రం ఉండరాదన్నారు. ఎన్నికల విధి నిర్వహణలో అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన ఆదేశించారు. ఎన్నికలు సమర్థంగా నిర్వహించడానికి ఉద్యోగులను ఆయా ప్రాంతాలలో నియమించాల్సి ఉందన్నారు. జిల్లా అధికారుల అనుమతి లేకుండా ఏ హెూదాలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈఎల్స్ ఇవ్వరాదన్నారు. ముఖ్యంగా సచివాలయాల సిబ్బందికి మూడు నెలల పాటు ఈయల్స్ తాత్కాలికంగా నిలుపుదల చేయాలన్నారు. ప్రభుత్వ గెజిటెడ్ అధికారులు, నాన్ గెజిటెడ్ అధికారులు, ఆఫీస్ సబార్డినేటర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు వేరువేరుగా ప్రతి శాఖ జిల్లా అధికారులు స్పష్టంగా నివేదిక నివ్వాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవిన్యూ అధికారి పి.వెంకటరమణ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని తూర్పు క్రిస్టియన్ పాలెం ముస్లిం బరియల్ గ్రౌండ్‌లో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, పలువురు వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఉన్న యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా,బ్లాక్ స్పాట్స్ లలో పోలీసులు విధులు నిర్వహిస్తూ రోడ్డు భద్రత నియమాలు, మోటారు వాహనాల చట్టల గురించి వాహన చోదకులు, ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని, రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు.

మరోసారి మోసం చేసేందుకే జగన్ 'సిద్ధం'

జనసేన-టిడిపి పాదయాత్ర ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలను మోసం చేసేందుకు మరోసారి సిద్ధం పేరుతో వస్తున్నారని, ప్రజలు జగన్ చెప్పే మాటలకు మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వైపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరు ఎరిక్షన్ బాబు, సిపిఎం, సిపిఐ, ఆప్ పార్టీల నేతలు డి సోమయ్య, అందే నాసరయ్య, సుదర్శన్ తదితరులు మాట్లాడారు. శనివారం రాత్రి పాదయాత్ర ముగింపు సందర్భంగా పెద్దారవీడు మండలం సుంకేసుల డ్యామ్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభకు జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్ అధ్యక్షత వహించారు. ఈ సభలో పైన పేర్కొన్న నేతలు మాట్లాడారు. జగన్ ఏడాదిలో వెలుగొండ పూర్తి చేస్తామని చెప్పారు అన్నారు. నేటికీ అతిగతి లేదన్నారు. నిర్వాసితులను పట్టించుకోలేదన్నారు. మార్కాపురం జిల్లా ఆవశ్యకతను గుర్తించలేదన్నారు. ఎలాంటి అభివద్ధి లేదన్నారు. వెనుకబడ్డ మార్కాపురం మరింత కరువుగా తయారైందన్నారు. ఇకపై వచ్చే ఎన్నికల్లో ఈ ప్రాంతంలో వైసిపి నేతలను నిలయాలని పిలుపునిచ్చారు. వెలుగొండ కోసం మార్కాపురం జిల్లా కోసం మార్కాపురం నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టిన జనసేన పార్టీ నేత ఇమ్మడి కాశీనాథుని పలువురు అభినందించారు.



మాట్లాడుతున్న నాయకులు

'విదేశీ విద్య'కు అంబేద్కర్ పేరు తీసేయడంపై..

సచివాలయ ఉద్యోగి రాజీనామా

ప్రజాశక్తి-చీరాల

'జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారు.. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ను తీసివేసి పేదలకు నాణ్యమైన విద్యను దూరం చేశారు. అదీ చాలదన్నట్లు అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి బాబాసాహెబ్ అంబేద్కర్‌ను పేరును తొలగించి జగన్ విదేశీ విద్య దీవెనగా పేరు మార్చడం దుర్మార్గమైన విధానం.. రాష్ట్ర పరిపాలన నాకు నచ్చలేదు' అంటూ చీరాలలో సచివాలయ ఉద్యోగి తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. తన రాజీనామాను శనివారం చీరాల మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు.

చిన్నగంజాం మండలం చింతకుంపల్లె గ్రామానికి చెందిన కొణిదల విజయకుమార్ చీరాల మున్సిపల్ పరిధిలోని 26వ వార్డులో ఉన్న సచివాలయంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన తనకు నచ్చలేదని ఎస్సీలను చిన్నచూపు చుస్తున్నారని, అందుకే రాజీనామా చేస్తున్నానని కమిషనర్ విజయ సారథికి రాజీనామా పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల పట్ల మొదటి నుంచి వైసీపీ ప్రభుత్వం వివక్షత చూపుతూనే ఉందన్నారు. దళితులను ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కుతోందన్నారు. ఎన్.సి.ఆర్.బి ప్రభుత్వ సంస్థ లెక్కల ప్రకారం దక్షిణ భారతదేశంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలన్నింటినీ కలుపుకొని జగన్ ప్రభుత్వం అవలంబిస్తున్న దుర్మార్గ చర్యలను ఎండగడతామని హెచ్చరించారు.



రాజీనామా పత్రాన్ని కమిషనర్‌కు అందజేస్తున్న విజయ్‌కుమార్

పరిహారం కోసం ఎదురుచూపులు



మిచౌంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులు రాష్ట్రప్రభుత్వం నుంచి తగిన నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. తుపాను అనంతరం వ్యవసాయశాఖ అధికారులు రూపొందించిన తుది నివేదిక ప్రకారం జిల్లాలో 1,17,960 ఎకరాల్లో వరి పంటకు, 25,452 ఎకరాల్లో ఇతర పంటలకు నష్టం వాటిల్లినట్లు తేల్చారు. 81,965 మంది రైతులు మాత్రమే రూ.91 కోట్ల మేర పంటను నష్టపోయినట్లు హెక్టారుకు రూ.15 వేలు వంతున లెక్కలు కట్టారు. కానీ వాస్తవంగా జిల్లాలో 3,33,300 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో 1,98,535 ఎకరాల్లో వరిపైరుకు, 1,34,765 ఎకరాల్లో ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో 1,84,488 మంది రైతులు పంట నష్టపోయారని తెలియజేస్తూ రూ.149 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ కోసం వ్యయసాయ శాఖ అధికారులు ముందుగా ప్రతిపాదనలు పంపారు. కానీ ఈ తరువాత తుది నివేదిక అంటూ సగానికి సగం కోత వేశారు. అయితే రాష్ట్రప్రభుత్వం నుంచి ఈ కొద్దిమేర సాయం కూడా నేటికీ విడుదల కాకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట నష్టపరిహారం త్వరితంగా విడుదల చేయాల్సి ఉంది.

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాన రాజకీయ పార్టీలు అయిన వైసిపి, టిడిపిలు ఎన్నికల్లో పోటీ చేయనున్న తమ అభ్యర్థులను దాదాపు ఖరారు చేశాయి. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఏ పార్టీ తరపున ఎవరు పోటీ చేయనున్నారో కొంత స్పష్టత వచ్చింది. ఒంగోలు అసెంబ్లీ నుంచి బాలినేని పోటీ చేస్తారా లేదా అనేది వెల్లడి కాలేదు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి రాజకీయ పయనం ఎలా ఉంటుందనేది తేలాల్సి ఉంది.

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ నేపథ్యంలో మతిచెందిన కుటుంబాలకు భరోసా కల్పించేందుకు 'నిజం గెలవాలి' పేరుతో నారా భువనేశ్వరి ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో రెండు రోజుల పాటు పర్యటించారు. బాధిత కుటుంబాన్ని ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమానికి టిడిపి శ్రేణులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎన్నికల కాలంలో తమ మాట వినని వారిని అధికార వైసిపి ప్రభుత్వం తమ దారికి తెచ్చుకునే ప్రయత్నాలు చేపట్టింది. అందులో భాగంగా ప్రతిపక్ష నేతలపై రాజకీయ దాడులు మొదలయ్యాయి. తమ మాట వినని స్వపక్షీయుల ఆర్థిక మూలాలపై కూడా దాడులు జరుపుతున్నారు. నయానాభయానా బెదిరించి తమ దారికి తెచ్చుకునే యత్నాలు చేస్తున్నారు. నోవా అగ్రిటెక్ కంపెనీకి చెందిన నల్లధనాన్ని అక్రమంగా చలామణిలోకి తెచ్చి 2019లో జరిగిన ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ ఎమ్మెల్యే ఏలూరి, ఆ కంపెనీ ఉద్యోగులు కొందరిపై ఇంకొల్లు పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్ర డైరక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్(డిఆర్ఐ) అధికారులు ఈ నెల 24న గుంటూరులో ఉన్న నోవా అగ్రిటెక్ కంపెనీలో సోదాలు నిర్వహించారు. మొన్నటి వరకు అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న బాచిన కృష్ణచైతన్య తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని భావించిన అధిష్టానం ఆయనపై కన్నెర్ర చేసింది. ప్రస్తుత వైసిపి ఇన్‌ఛార్జి హనుమారెడ్డికి వ్యతిరేకంగా ఉన్నారని టిడిపిలోకి చేరనున్నారని తెలియడంతో కృష్ణచైతన్యకు చెందిన గ్రానైట్ క్వారీలపై మైనింగ్ అధికారులు మూడు రోజుల క్రితం దాడులు జరిపారు. క్వారీలో కొలతలు వేసి భారీ జరిమానాకు సన్నద్ధం అయ్యారు. దీంతో కృష్ణచైతన్య రాజకీయ వ్యూహంలో చిక్కుకున్నారు. టిడిపి వర్గీయులకు చెందిన పలు గ్రానైట్ పరిశ్రమలపై నెల్లూరు, మచిలీపట్నం నుంచి రెండు బృందాలుగా మైనింగ్ అధికారులు సోదాలకు వచ్చారు. మైనింగ్ అధికారులతో పాటు వైసిపికి చెందిన ప్రైవేట్ వ్యక్తులు కూడా రావడం, నెంబరు ప్లేట్ లేని వాహనాల్లో వచ్చిన అధికారుల కారుల్లో కర్రలు, కారం పొట్లాలు ఉండడం వివాదాస్పదం అయ్యింది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా